J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 28 17.12.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# దివ్య కాశీ!.. ఇక.. నవ్య కాశీ!



## వారణాసి చరిత్రలో కొత్త అధ్యాయం

## ప్రధాని మోడీ చేతుల మీదుగా కాశీ విశ్వనాథ్ కారిడార్ ప్రారంభం

## 3 వేల నుంచి 5 లక్షల అడుగులకు ఆలయం విస్తరణ

## ప్రపంచంలోనే అద్వితీయమైన దివ్యధామంగా కాశీ మహాక్షేత్రం



దివ్య కాశి..నవ్యరూపం సంతరించుకుంది. కాశీ విశ్వనాథుని ఆలయం దేదీప్యమానంగా.. జగజ్జేగీయమానంగా వెలిగిపోయింది. అన్నపూర్ణాదేవి ఆనందంతో మురిసిపోయింది. గంగామాత చిరునవ్వులతో ఉప్పొంగిపోయింది. భరతమాత పులకించిపోయింది. శతాబ్దాల నాటి చరిత్రాత్మక నగరమైన వారణాసి..ఇప్పుడు ప్రపంచంలోనే ఒక అద్భుతమైన దివ్యధామంగా రూపుదిద్దుకుంది. దీంతో కాశీలోని ప్రజలంతా ప్రధాని మోడీని సగౌరవంగా కీర్తిస్తూ పెద్దపెట్టున 'దివ్య కాశి..భవ్య కాశి' అంటూ నినదిస్తూ సంతోషభరితులైపోతుంటే, దివ్య కాశి..నవ్య కాశిగా అవతరించి భారతదేశ ఆధ్యాత్మిక శిఖరానికే కీర్తికిరీటంగా ధగధగలాడింది. భారతీయుల చిరకాల స్వప్నం నెరవేరింది.

కాశి చరిత్రలోనే కాదు..భారతదేశ చరిత్రలోనే ఇది సువర్ణాధ్యాయం. కాశి అంటే..సాక్షాత్తూ ఆ పరమశివుని దివ్యధామం. మహా పుణ్యక్షేత్రం. అందుకే 'కాశ్యాం తు మరణాన్ముక్తి:'..అంటున్నాయి మన ప్రాచీనశాస్త్రాలు. కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుందని, పునర్జన్మ ఉండదని భావం. ఇంతటి విశిష్టమైన కాశీక్షేత్రానికి ఇప్పుడు మరెంతో వైభవం వచ్చింది. పరమపావనమైన ఆ పరమశివుని కోవెల సరికొత్త వైభవంతో అలరారిన రోజు..(డిసెంబరు 13) కూడా చరితార్థమైంది. శతాబ్దాల చరిత్రకు సాక్షిగా నిలిచిన వారణాసి నగరం భారత ప్రధాని మోడీ

14లో

## 'హిందూత్వ' పేరుతో...
# రాహుల్ విమర్శలు
### సర్వత్రా చర్చనీయాంశం



మన నాయకులు ప్రత్యర్థి నాయకులపై ఘాటైన విమర్శలు చేస్తుండడం సర్వసాధారణమే. అందులోనూ అధికారపక్షాన్ని ప్రతిపక్షంలో ఉన్నవారు తమ చిత్తానుసారం విమర్శలు గుప్పించి ఇరుకున పెడుతుండడం కూడా సాధారణంగా జరుగుతుండేదే. ఆ విమర్శల్లో అధికారపార్టీ పాలనా తీరును దుయ్యబట్టడం ప్రతిపక్షంలోని నాయకులకు వెన్నతోపెట్టిన విద్య. ఆ విమర్శల పరంపరలో భాగంగా 'హిందూ' –'హిందూత్వ'..అనేవి వేరు వేరు పదాలని, ఈ రెండు పదాలకు ఒకే అర్థం ఉండదని అంటూ, 'భారత్ హిందువుల దేశమని, ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని ఆరాటపడే హిందూత్వవాదులది కాదని'..కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్‌గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ప్రధాని మోడీపై చేస్తున్న ఆరోపణల పర్వంలో భాగంగా మోడీ పరిపాలనపై విమర్శలు చేస్తూ ఆయన చేసిన ఆ వ్యాఖ్యలు సరికొత్త వివాదంతో సర్వత్రా చర్చనీయాంశం అయ్యాయి కూడా. అయితే అధికార పక్షంపై ఆగ్రహంతో చేసిన ఆయన ఆరోపణలు 'హిందూత్వ'ం పేరుతో చేయడంతో మరింత కలకలం రేగుతోంది.

14లో

# శతాయుష్మాన్ భవ!



మా ఆత్మబంధువు.. ఆత్మీయ సింధువు

## జె.కె.రెడ్డి గారికి

### 80వ పుట్టినరోజు శుభాకాంక్షలు.



తుంగా కుటుంబం

## 'విజయపథంలో నెల్లూరీయులు'





నెల్లూరుజిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మరియు జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావులను కలిసి 'లాయర్' 40వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీటేబుల్ బుక్‌ను అందజేస్తున్న శివప్రభాత్‌రెడ్డి (ప్రభు).



### 'గురుకృప' చిన్నారులకు

## 'గిన్నిస్‌బుక్' సర్టిఫికెట్లు

గత ఏడాది ఫిబ్రవరిలో చెన్నైలోని త్యాగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అతిపెద్ద నృత్య కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు నగరంలోని గురుకృప కళాక్షేత్రానికి చెందిన 45 మంది నాట్యకళాకారులకు గిన్నిస్‌బుక్ ప్రశంసలు లభించాయి. ఆ కార్యక్రమంలో వీరి నాట్య ప్రదర్శనను మెచ్చుకుని ఆ సంస్థ సర్టిఫికెట్లను బహుకరించింది. ఈ నాట్య కార్యక్రమంలో పాల్గొన్న నాట్యకళాకారులకు గిన్నిస్‌బుక్ నుంచి ఇటీవల సర్టిఫికెట్లు అందాయి. వారి నృత్య గురువులైన సురభి గాయత్రి, పురాణం కల్పనలకు ఆ సంస్థవారు ఉత్తమ నాట్యగురువులుగా అవార్డులను అందజేసి అభినందించినట్లు గురుకృప అధినేత్రి గాయత్రి తెలిపారు. గిన్నిస్‌బుక్ సర్టిఫికెట్లు అందుకున్న ఆనందంతో ఈనెల 12వ తేదీన వారంతా స్థానిక గురుకృప కళాక్షేత్రం ప్రాంగణంలో సంబరాలు చేసుకున్నారు.

### ఏకాగ్రతతోనే..

## అద్భుత విజయాలు

**- సోమనాథ్ బాగ్జీ**




ఏకాగ్రతతో సాధన చేస్తే ఎంతటి అద్భుత విజయాలనైనా సాధించవచ్చని, ప్రతిఒక్కరూ దీక్షతో, అంకితభావంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని అఖిలభారత వివేకానంద యువ మహా మండల్ ప్రధాన కార్యదర్శి సోమనాథ్ బాగ్జీ చెప్పారు. ఈనెల 12న ఆయన నెల్లూరులోని వివేకానంద యువ మహామండల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని వివేకానంద యువజనోద్యమం ఆంధ్రరాష్ట్రంలో ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యువతలో చైతన్యం నింపే కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన అన్నారు. చెన్నై రామకృష్ణ మిషన్‌కు చెందిన స్వామి యదునాథ నందాజీ పాల్గొని వివేకానందుని జీవిత విశేషాలను, యువత కోసం ఆయన చేసిన త్యాగాలను వివరించారు. తొలుత బాలాజీనగర్‌లో ఉన్న ఆంధ్రసభ కల్యాణ మండపంలో వారు యువజన శిక్షణ శిబిరంలో పాల్గొని తగు సూచనలిచ్చారు. మహామండల్ నెల్లూరు అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, విశాఖపట్నం శాఖ అధ్యక్షుడు ఎన్.లక్ష్మీనారాయణ, సాయికుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు యశ్వంత్, కార్యదర్శి ఏ.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

## విజయవంతంగా లోక్ అదాలత్

### 2,300 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లావ్యాప్తంగా జరిగిన కార్యక్రమం విజయవంతమైంది. నెల్లూరులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ సి.యామిని లోక్‌అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడుతూ రాజీ ప్రక్రియ ద్వారా కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ లక్ష్యమని, లోక్ అదాలత్‌లో ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని చెప్పారు. జాతీయ, రాష్ట్రీయ న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నెల్లూరు, కోవూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, గూడూరు, వెంకటగిరి, కోట, నాయుడుపేట, సూళ్ళూరుపేటలలో మొత్తం 2300 కేసులను పరిష్కరించి లబ్దిదారులకు 7,35,36,000 రూపాయలు పరిహారం చెల్లించేవిధంగా తీర్పు చెప్పారు. అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎం.తిరుమలరావు, ఐ.శైలజాదేవి, ఎన్.సత్యశ్రీ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ఎం. శ్రీనివాసులునాయక్ ఆధ్వర్యంలో 5 బెంచీలు ఏర్పాటుచేశారు. న్యాయమూర్తులు ఎం.తిరుమలరావు, బాలాజీ, లక్ష్మీనారాయణ, ప్రసూన, రాజశేఖర్‌లు పాల్గొని అనేక కేసులను పరిష్కరించారు.

## స్వర్ణా వెంకయ్యకు.. 'సేవా డాక్టరేట్'





సామాజిక ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్, నెల్లూరుకు చెందిన స్వర్ణా వెంకయ్యకు చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ వారు ఇటీవల 'సేవా డాక్టరేట్'ను ప్రదానం చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. చెన్నైలో రాజా అన్నామలై మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన్ను ఘనంగా సన్మానించి అవార్డును బహుకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన్ను అభినందించారు.

## జీవిత సత్యాలు తెలిపే.. 'జీవన పోరాటం'

గుడిమెట్ల చెన్నయ్య వృత్తిరీత్యా బ్యాంక్ ఉద్యోగి. పదవీ విరమణ అనంతరం సాహితీసేవలో తరిస్తున్నారు. అంతేగాక తనే స్థాపించిన 'జనని' అనే తెలుగు సంస్థ ద్వారా తన మాతృభాషా సాహిత్యాలకు నిరంతరం సేవలందిస్తున్నారు. పొరుగు రాష్ట్రంలో ఉన్నా తెలుగు మీద మక్కువ వదలని మాతృభాషాభిమాని చెన్నయ్య.

సమాజం పట్ల మంచి అవగాహనను ఏర్పరుచుకున్న చెన్నయ్య కలాన్ని పట్టి తన భావాలకు అక్షర రూపం బహుకాలంగా ఇస్తున్నారు. వ్యయప్రయాసల కోర్చి, వాటిని ముద్రించి తెలుగు పాఠకలోకానికి అందిస్తున్నారు. ప్రస్తుతం 'జీవన పోరాటం' అనే కవితా సంపుటిని ముద్రించారు. ఇందులో మొత్తం 42 కవితలున్నాయి. ప్రతి కవితా వారి మనోభావాలకు దర్పణం. జీవితంలో తానునుభవించిన తీపి, చేదు అనుభవాలే ఈ కవితలు. ఆకలి, పేదరికం, మానవత్వం, నిర్లక్ష్యం, మనుషుల ప్రవర్తనలు, కుటుంబసభ్యుల మధ్య అవమానాలు, ఆత్మవిమర్శలు, కూలీల జీవితాలు, కవుల స్వభావాలు, వ్యసనాలకు బానిసలైన యువకులు, భార్యాభర్తల అన్యోన్యం, వృద్ధ తల్లిదండ్రుల ఆవేదనలు, ఆత్మాభిమానాలు, పెడదారిపడుతున్న యువతరం, స్నేహం, మోసం, తల్లిదండ్రుల ఆశలు, హింస, అమ్మ గొప్పతనం, భాషామతల్లి ఆవేదన, అత్యాచారాలు, పెళ్ళిళ్ళ తీరు, మొదలైనవి ప్రధాన వస్తువులుగా కవితలల్లారు గుడిమెట్ల. గుండె తలుపులు తట్టారు.




**రచయిత: గుడిమెట్ల చెన్నయ్య**
**వెల: రూ. 100/-** **పేజీలు: 92**
**ప్రతులకు: గుడిమెట్ల చెన్నయ్య**
**13/53, 2వ వీధి, వాసుకి నగర్,**
**కొడుంగైయూర్, చెన్నై - 600 118.**
**సెల్. 97907 83377.**

ప్రస్తుతం ఉన్న నిరుద్యోగుల స్థితిని గురించి చెపుతూ, "ప్రతిభకు లేదు పైసలకున్న విలువ / చదువుకు లేదు ఉత్తరాల కున్న గౌరవం" అంటారు. ఉత్తరం అంటే రికమెండేషన్ అని అర్థం. సహజంగానే భాషాభిమాని అయిన చెన్నయ్య గిడుగు గురించి చెపుతూ, 'గిడుగు అంటే చిచ్చరపిడుగు / వేయడు ఎన్నడూ వెనకడుగు' అంటాడు. అలానే పి.వి.నరసింహారావును, సర్వేపల్లి రాధాకృష్ణన్, గుర్రం జాషువాలను ప్రస్తుతించాడు. కవులను 'అలవర్చుకో విశాల మనస్తత్వాన్ని / ఆపకు నీ ప్రయాణాన్ని'.. అంటూ హెచ్చరిస్తాడు. చెన్నయ్య కవిత్వంలో ఒక ప్రత్యేకత వుంది. ప్రతి కవితా ఒక కథ. లేదా ఒక సంఘటన అనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన కవితలన్నీ జీవితసత్యాలే అనిపిస్తాయి.

ముఖ్యంగా, చెన్నై పేరు వినగానే తెలుగువారందరికీ గుర్తొచ్చే పేరు 'చెన్నయ్య'ది. అంతగా ఆయన, ఆయన సంస్థ 'జనని' తెలుగువారి హృదయాల్లో ముద్ర వేసుకున్నారు. ఆయన భాషా, సాహితీ సేవలు ఇలాగే నిరంతరం సాగాలని, ఆయన కలం నుండి ఇంకా మరెన్నో కవితలు జాలువారాలని కోరుకుందాం.



సమీక్షకులు:
**డా. గంగిశెట్టి శివకుమార్**
నెల్లూరు.

## శ్రమ అంచుల్లోనే...!

గాలిని ప్రోగుచేసి పాదులేస్తే
పంట పండుతుందా
ఆహారమై నిలుస్తుందా
ధూళిని పాతిపెట్టి నీరుపోస్తే
నిమ్మళంగా మొలకెత్తుతుందా
మన ఆకలి తీరుస్తుందా
జిల్లేళ్ళ మొలకలు సాగుచేస్తే
హరితవనమై
కడుపు నింపే భద్రత
భరోసానిస్తుందా
అదునుచూసి అరకతీసి
తెలివైన చూపుల్తో
అలివైన పంటలు
పండించాలి
దుక్కిదున్నిన నాడే
సరికొత్త ప్రభాతాల్ని ఆవిష్కరించాలి
పరిశీలనతోనే, పరిశోధనతోనే
ప్రతి అడుగూ
ముందడుగై రూపొందాలి
రేపుకు రూపుదిద్దే పరిపుష్టి కోసం
ఎరువులు సమృద్ధిగా వాడకపోతే
విజన్ సూర్యుణ్ణి మనసుల్లో
వెలిగించకపోతే –
చీకటిపొదల్లో దిగాలు
పంటలు పండుతాయి.
మనం సృష్టించే కృషి కిరణమే
మనం నాటే వరిపైరు
రేపటి వసంతోత్సవాల్ని
కన్నుల్లో పూయిస్తుంది.
పైరైనా, పరిశ్రమైనా
నిమగ్నతే పెట్టుబడిగా
అద్భుతాల తేనెలసోనలు
సోపానాలుగా
నిర్మాణాత్మక శ్రమైకనాదమే
గెలుపుకు ఊపిరులూదుతుంది
ప్రజ్ఞ ప్రతిజ్ఞాపాటవాలే
సంస్థలకు దిక్సూచులవుతాయి
అజేయ సామ్రాజ్యపు
గెలుపుధారలు
శ్రమ అంచుల్లోనే కురుస్తాయి.
పని సంస్కృతి ఫరిడవిల్లితేనే
పగలే వెన్నెలై ప్రతిఫలిస్తుంది!




**- చిన్ని నారాయణరావు**
**9440202942**

## ‘విజయపథంలో నెల్లూరీయులు’

‘విజయపథంలో నెల్లూరీయులు’ కాఫీ టేబుల్ పుస్తకం ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొనలేక పోయిన 40 మంది ప్రముఖులలో మరికొందరు.. ‘పద్మభూషణ్’ జివికె రెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి (చీస్ రెడ్డి)కి బదులుగా వారి మామ దామవరపు రాధాకృష్ణారెడ్డి, కోదండరామిరెడ్డి, కరవళ్ళ వెంకటరమణారెడ్డిలను కలిసి పుస్తక ప్రతిని అందజేస్తున్న శివప్రభాత్‌రెడ్డి (ప్రభు).









### సహకార శాఖ అభివృద్ధికి

# ప్రణాళిక లేమిటి?

### - పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి



సహకార మంత్రిత్వ శాఖ విజన్ ఏమిటి?.. సహకారం నుండి శ్రేయస్సు వరకు ఆ శాఖ ఎలాంటి కార్యాచరణ అమలు చేస్తోంది?.. ఆ మంత్రిత్వ శాఖ ప్రణాళిక ఏమిటని ఈనెల 15న పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దేశంలోని సహకార సంఘాల వివరాలు, వాటి స్థితి, చేస్తున్న సాయం వివరాలు తెలియజేయాలని కూడా అడిగారు. అందుకు కేంద్రమంత్రి అమిత్ షా సమాధానమిస్తూ దేశం ఇప్పటికే గొప్ప సహకార వారసత్వాన్ని, బలమైన సహకార రంగాన్ని కలిగివుందని తెలిపారు. దేశంలో దాదాపు 8,54,355 సహకార సంఘాలు ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలో సహకార రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు, సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి చట్టపరమైన, విధాన ఫ్రేమ్‌వర్క్‌ను అందించడం కోసం ప్రభుత్వం కొత్త సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందన్నారు.

### విమానాశ్రయాల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

విమానాశ్రయాల పటిష్ట నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల మెయింటెనెన్స్, రిపేర్, ఆపరేషన్స్(ఎంఆర్ఓ) విధానాన్ని ఆవిష్కరించిన విషయం వాస్తవమేనా? అలా అయితే, ఆ పాలసీ కింద గుర్తించిన విమానాశ్రయాల వివరాలు తెలపాలని ఎంపి వేమిరెడ్డి రాజ్యసభలో ప్రశ్నించారు. అందుకు కేంద్రమంత్రి డాక్టర్ వీకే సింగ్ సమాధానమిస్తూ.. ఆ విధానం ద్వారా విమానాశ్రయాల్లో సేవల అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు 2021 సెప్టెంబర్ 1న సవరించిన మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం భోపాల్, చండీగఢ్, చెన్నై, హైదరాబాద్, జుహు, కోల్‌కతా, ఢిల్లీ, తిరుపతి విమానాశ్రయాలను గుర్తించామన్నారు.



### ఢిల్లీలో ఎంపీలకు

# మాగుంట శీనయ్య ఆత్మీయ విందు




ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డి ఈ నెల 16వ తేదీ గురువారం ఢిల్లీలోని తమ కార్యాలయంలో అన్ని పార్టీలకు చెందిన 176 మంది సీనియర్ లోక్‌సభ మరియు రాజ్యసభ సభ్యులకు ఆత్మీయంగా విందు ఏర్పాటు చేసి నెల్లూరీయుల ఆతిథ్యాన్ని, అభిమానాన్ని వారందరికీ పంచారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మీనాక్షి లేఖీ, పార్లమెంటుసభ్యులు శరద్‌పవార్, దిగ్విజయ్‌సింగ్, జయరాం రమేష్, గిరీష్ బాపట్, మిధున్‌రెడ్డి, మనీష్‌తివారీ, కళ్యాణ్ బెనర్జీ, మహువా మైత్రా, రాజీవ్ ప్రతాప్‌రూడీ, దయానిధి మారన్, కార్తీ చిదంబరం, గోవా మాజీ ముఖ్యమంత్రి ఫ్రాన్సిస్కో సార్దిన్హా, పినాకీ మిశ్రా, బార్త్రారి మెహతాబ్, సుప్రియ సూలె, షాంసింగ్ యాదవ్, యం.తమ్మిదొరై, ప్రొఫెసర్ సౌగత్‌రాయ్ తదితర సభ్యులు ఈ విందులో పాల్గొన్నారు.











## 'ప్రభా'తం

# ఈ తరం భవిత.. ప్రశ్నార్థకమేనా?..

కరోనా దెబ్బతో పాఠశాలలు మూతబడి..చదువులు కనుమరుగవుతుంటే, విద్యావ్యవస్థ క్రమేణా కుదేలైపోతుంటే ప్రపంచంలోని అనేకదేశాలు ఆవేదనలో మునిగిపోతున్నాయి. తగ్గిపోతుందనుకుంటున్న కరోనా తగ్గకపోగా రానురాను మరింతగా విజృంభిస్తుండడంతో ఇక తాము బడులకు వెళ్లే పరిస్థితే ఉండదా...తమ చదువులు అటకెక్కినట్లేనా?. అని కోట్లాదిమంది విద్యార్థులు నిరాశలో కూరుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో మనదేశంలోనూ ఈ తరం పిల్లల భవిత కూడా ప్రశ్నార్థకంగానే ఉంటుందని నిపుణుల అధ్యయనాలు చెప్తున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు ఇకనైనా వెంటనే మేల్కొని విద్యారంగాన్ని గట్టెకించడానికి, పిల్లల భవితను కాపాడడానికి వెంటనే తగు ప్రణాళికలను అమలుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కరోనా దెబ్బతో పాఠశాలలు మూతబడి..చదువులు రానురాను కనుమరుగవుతుంటే, విద్యావ్యవస్థ క్రమేణా కుదేలైపోతుంటే ప్రపంచంలోని అనేకదేశాలు ఆవేదనలో మునిగిపోతున్నాయి. అన్ని వ్యవస్థలతో పాటు విద్యారంగం మీద కూడా కరోనా తన ప్రతాపం చూపుతుండడంతో బడులకు పోలేని పిల్లలు బిక్కమొగం పెట్టుకుని ఉంటున్నారు. తగ్గిపోతుందనుకుంటున్న కరోనా తగ్గకపోగా రానురాను మరింతగా విజృంభిస్తుండడంతో ఇక తాము బడులకు వెళ్ళే పరిస్థితే ఉండదా...తమ చదువులు అటకెక్కినట్లేనా?. మా జీవితాలు ఇంతేనా?.. అని విద్యార్థులు, యువత దిగాలుపడిపోతున్నారు. అనేకదేశాల్లో ఈ పరిస్థితి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, మేధావులను తీవ్రంగా కలచివేస్తోంది. ఈ విషయాన్నే మరింతగా స్పష్టం చేస్తూ.. ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాల్లో పాఠశాలలు మూతపడడం వల్ల ఒక తరం మొత్తం దుర్భలమయ్యే ప్రమాదం ఉందంటూ తాజాగా ప్రపంచబ్యాంకు నివేదిక హెచ్చరిస్తోంది. కరోనా మూలంగా ప్రపంచ విద్యావ్యవస్థలు స్తంభించిపోయాయని, విజ్ఞాన సముపార్జనకు పిల్లలు దూరం కావడం, ఒక తరం పిల్లలు పేదరికంలోకి జారిపోవడం భవిష్యత్తు ఉత్పాదకత, ఆదాయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నది ఆ నివేదిక సారాంశం. దీంతో విద్యార్థుల భవిష్యత్తు..ఈ తరం భవిత ఇక ప్రశ్నార్థకమేనా?.అనే ఆందోళనే సర్వత్రా వినిపిస్తోంది. బడుల మూసివేతతో దాదాపు 17 లక్షల కోట్ల డాలర్ల జీవితకాల ఆర్జనను నష్టపోవడం జరుగుతుందని, ఇది ప్రపంచ జీడీపీలో 14 శాతానికి సమానమని హెచ్చరించింది కూడా. ఈ నష్టాలు అనివార్యమవుతున్న దేశాల్లో మనదేశం కూడా ఉందని హెచ్చరించింది. ఇప్పటికే కరోనా దెబ్బకి మన విద్యారంగం కూడా కుదేలైపోయింది. ఇదెంతో ఆందోళనకరమైన విషయం అని వేరే చెప్పనక్కర లేదు. ఈ దుస్థితి నుంచి ఎలా బయటపడాలో ప్రభుత్వాలు, పాలకులు, మేధావి వర్గాలు శోధించి ఈ తరం విద్యార్థుల భవితను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాఠశాలలకు ప్రత్యామ్నాయంగా ఆన్‌లైన్ విద్యలున్నా అవన్నీ కోట్లాదిమందికి అందుబాటులో లేవు. పైపెచ్చు పాఠశాల వాతావరణంలో స్వేచ్ఛగా చదువుకోవాల్సిన పిల్లలు ఇళ్ళకే పరిమితమైపోవడం వల్ల మానసికంగా కుంగిపోతున్నారు. గురువుల బోధన కరువైపోయింది. క్రమశిక్షణ, ఉత్తమ విద్యాబోధన, సద్భావనలు నేర్పే అవకాశం లేకుండా పోతోంది. కరోనా వ్యాధికి భయపడి పాఠశాలలకే కాదు బయటికి వెళ్ళాలన్నా అందరినీ భయమే వెంటాడుతోంది. పెద్దలు ఎలాగో ఈ వ్యాధి వ్యాప్తికి దూరంగా ఉండేందుకు నానా తంటాలు పడుతూనే ఉన్నారు. కానీ పిల్లల పరిస్థితే అర్థం కావడం లేదు. వారి చదువులేమవుతాయో..భవిత ఏమవుతుందో?..అందరి ఆందోళన ఇదే. బడులకు వెళ్ళి హాయిగా చదువుకోవాల్సిన పిల్లలంతా ఇళ్ళలోనే ఉండిపోవాల్సిన దుర్గతి. అనేక దేశాల్లో ఆన్‌లైన్ విద్యలున్నా అవి అందరికీ అందుబాటులో ఉండడం లేదు. ప్రపంచంలో కోటానుకోట్ల మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు అలాంటి వసతులు లేవు. కరోనా నేపథ్యంలో కోట్లాది కుటుంబాల ఆర్థికస్థితి కూడా దిగజారిపోయింది. ఆధునిక వసతులు పొందడం అందరికీ కష్టసాధ్యమవుతోంది. కరోనా వ్యాధి నేపథ్యంలో అన్ని రకాల వ్యవస్థలు క్రమేణా కుప్పకూలిపోతున్నాయి. ప్రపంచంలోని అత్యధిక దేశాల్లో ఎక్కడా తిరోగతి తప్ప పురోగతి మాట వినిపించడం లేదు. ఈ మాయదారి కరోనాతో బతకడమే ఒక సవాలుగా పరిణమిస్తుంటే అభివృద్ధి మాట దేవుడెరుగు.. బతికుంటే బలుసాకు తినొచ్చనే ప్రాణభయంతో ప్రపంచం హడలెత్తిపోతోంది. దాదాపు అన్ని దేశాల్లోనూ ఇదే దుస్థితి. కరోనా మాత్రం ఆగకుండా నేటికీ మృత్యుఘంటికలు మోగిస్తూనే ఉంది. ప్రపంచం యావత్తూ దాని దెబ్బకు నేటికీ అతలాకుతలం అవుతూనే ఉంది. తగ్గిపోతుందిలే అనుకున్న కరోనా ఒమిక్రాన్ రూపంలో సకల మానవాళినీ బెంబేలెత్తిస్తూ ఉంది. ఎప్పుడు ఇది ఎలాంటి ముప్పు తెస్తుందో ఎవరూ ఊహించలేకపోతున్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు 27 కోట్లా 12 లక్షల మందికి పైగా వచ్చాయి. ఇందులో ఈనెల 14 నాటికి 53.32 లక్షల మంది మృత్యువాతపడ్డారంటే కరోనా రాకాసి ఎంతగా విజృంభిస్తూ మానవాళి ప్రాణాలు తీస్తుందో తేటతెల్లమవుతూనే ఉంది. ఇంకొద్ది రోజుల్లోనే బాధితుల సంఖ్య 30 కోట్లకు చేరుకుంటుందేమో తెలియదు. ఎప్పటికప్పుడు అన్నిరకాల చికిత్సలు, జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నా ఈ వ్యాధి తగ్గినట్లుగానే ఉంటూ మళ్ళీ విలయతాండవం చేస్తూనే ఉంది. మనదేశంలో కూడా కరోనా వ్యాప్తి తగ్గడమే లేదు. ఇప్పటికే 3 కోట్లా 47 లక్షలకు మందికి పైగానే ఈ వ్యాధికి గురయ్యారు. 4 లక్షలా 75 వేల మందికి పైగానే మరణించారు. అయితే, కరోనాను నియంత్రించడంలో అనేక దేశాలతో పోలిస్తే మనదేశం ఎంతో మేలు. ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల వల్ల కరోనా నుంచి కోట్లాదిమంది కోలుకుంటున్నారు. అయినా, పూర్తిస్థాయిలో కరోనా కట్టడికి చేయాల్సిందెంతైనా ఉంది. కరోనా ధాటికి మనదేశంలోనూ ఆర్థిక వ్యవస్థలు, అభివృద్ధి వ్యవస్థలు అన్నీ చితికిపోయాయి. ఉపాధి కరువై కోట్లాదిమందిపేదలు అల్లాడుతూనే ఉన్నారు. వారిని తిరిగి కోలుకునేలా చేయడం ఒక పెద్ద కసరత్తుగానే ఉంది. వ్యాక్సిన్లు వేసుకున్నా వాటికి కూడా లొంగకుండా ఒమిక్రాన్ వైరస్ వంటివి విజృంభించే అవకాశం ఉందంటూ తాజాగా నిపుణులు హెచ్చరిస్తుండడంతో విద్యార్థులకు సామూహిక విద్యాబోధన సాధ్యం కావడం లేదు. నిరంతరం సామాజిక దూరం పాటిస్తూ ఉండాలంటే చిన్నారులు, విద్యార్థులకీ కష్టంగానే ఉంటోంది. అయినా తప్పదు. మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటించడం వంటి నియమాలు అనుసరించడం అత్యవసరం కూడా. కరోనా నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి ముందు జాగ్రత్తలే ముఖ్యం. స్వీయరక్షణలే ఈ దశలో ఎవరికైనా శ్రీరామరక్ష!

### వెన్నెలకంటి వర్థంతి సందర్భంగా..

# కవితల పోటీలు

ప్రముఖ సినీకవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ ప్రథమ వర్థంతి సభ జనవరి 5న నెల్లూరు టౌన్‌హాలులో ఏర్పాటుచేస్తున్నామని, ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కవితల పోటీ నిర్వహిస్తున్నామని వెన్నెలకంటి మిత్రుడు వై.శేషగిరీశం ఒక ప్రకటనలో తెలియజేశారు. వెన్నెలకంటి ఆకాంక్ష మేరకు గతంలో ఆయన నిర్వహించిన 'చేతన' సంగీత సాహిత్య సాంస్కృతిక సంస్థను పున:ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. కవితల పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు కూడా పాల్గొనవచ్చని, కవితలు సామాజిక ప్రయోజనం కలిగించే ఇతివృత్తంతో ఉండాలని, కవిత 20 పంక్తులకు మించకూడదని, ఒక కవి ఒక కవితనే పంపాలని, హామీపత్రం మీదనే పేరు రాయాలని, బహుమతుల ప్రకటనలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా 3వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 2వేలు, తృతీయబహుమతిగా వెయ్యి రూపాయలతో పాటు మరో 8 మంది కవులకు రూ. 500 వంతున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. డిసెంబరు 30వ తేదీలోగా కవితలు పంపాలన్నారు. వాట్సాప్, మెయిల్స్ ద్వారా పంపిన కవితలు అంగీకరించబడవన్నారు. కవితలను వై.శేషగిరీశం, 26-3-1618, 5వ వీధి, చంద్రమౌళినగర్, వేదాయపాళెం, నెల్లూరు అనే చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 94402 66476 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

# పొట్టేపాళెంలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ



నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో ఈనెల 12న ప్రధాని ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన పలువురు మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. గ్రామంలో 26 మంది మహిళలను ఈ పథకం లబ్దిదారులుగా ఎంపిక చేసి వారికి గ్యాస్‌సిలిండర్ల సెట్‌లను పంపిణీ చేశారు. పొట్టేపాళెంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ కమిటీ ఛైర్మెన్, స్థానిక వైకాపా నాయకుడు పొన్నాల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### ఏసి స్టేడియం వాకర్స్..

# కొత్త కార్యవర్గం

**అధ్యక్షునిగా కనకట్ల రఘురామ్**



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ వారు ఇటీవల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనకట్ల రఘురామ్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రామానాయుడు, కోశాధికారిగా దాసరి అనంత రామారావు ఎంపికయ్యారు. ఎన్నికల ప్రక్రియను బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్, కె.విజయ భాస్కర్‌రెడ్డి నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని స్థానిక ప్రముఖులు కిలారి తిరుపతి నాయుడు, వేలూరు రంగారావు, శేషగిరి రావు, ప్రసాద్‌బాబు, దద్దోలు రమణయ్య, బొబ్బల శ్రీనివాసయాదవ్ తదితరులు అభినందించారు.

### సౌత్ ట్రాఫిక్

# సిఐగా రామారావు

నెల్లూరులోని సౌత్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.రామారావు ఇటీవల నియమితులయ్యారు. సిసిఎస్ ఇన్‌స్పెక్టరుగా ఉన్న ఆయన్ను ట్రాఫిక్ విభాగానికి కేటాయించడంతో ఆయన ఆ స్థానంలో బాధ్యతలు స్వీకరించారు.

# కూరగాయల్ని కొనలేకపోతున్నాం బాబో!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

కూరగాయల ధరలు ఆకాశానికెదిగిపోయాయంటే ఏమిటో ఇప్పుడు మనందరం కళ్ళారా చూస్తున్నాం. అయినా ఇంతటి ధరలు ఎప్పుడూ లేవు. మునక్కాయలు కిలో అక్షరాల ఆరువందల రూపాయల దాకా ఉందంటే ఏం చెప్పాలో తెలియడం లేదు. టమోటోలు కిలో 120 నుంచి 150 దాకా ధర పలుకుతున్నాయి. వంకాయలు, బీరకాయలు, చిక్కుడుకాయలు, ఇలా ఏవైనా సరే కిలో వందకి తగ్గడం లేదు. వంద రూపాయలిస్తే తప్ప కిలో వంకాయలు కూడా రాని కలికాలం ఇది. ఈ మండుతున్న ధరల్ని చూస్తుంటే ఏం కొనాల్నో, ఏం తినాల్నో అర్థం కావడం లేదు. ఆకుకూరలు కూడా మూడు నాలుగేసి కట్టలు మొన్నటిదాకా పది రూపాయలకే ఇచ్చేవారు. ఇప్పుడు ఇరవై చెప్తున్నారు. అన్ని ధరలూ పెరిగిపోయాయి. కూరగాయల అంగళ్ళలోనే కాదు, మార్కెట్‌లలో కూడా కూరగాయలు సలీసుగా ఏమీ లేవు. ఎక్కడ చూసినా ధరలు మండిపోతూనే ఉన్నాయి. దీంతో కూరాకులు అమ్మేవాళ్ళు కూడా ప్యాకెట్టు 20కి ఇచ్చేవాళ్ళు ఇప్పుడు అదే కూర ప్యాకెట్‌ను 30 నుంచి 40 దాకా పెంచేశారు. రోజురోజుకూ ఇలా ధరలు పెరగడమే తప్ప తరగడం లేదు. ధరల్ని నియంత్రించడానికి అధికారులు పెద్దఎత్తున చర్యలు తీసుకోవాలి. లేకుంటే బీదాసాదా జనం అన్నం, మజ్జిగనీళ్ళతోనే సరిపెట్టుకోవాల్సి ఉంటుంది!...

**ఎం.కనకదుర్గమ్మ, నెల్లూరు.**

# దాతల సేవలు అభినందనీయం

నెల్లూరుజిల్లాను ఇటీవల ఊపేసిన వానలు, వరదల బీభత్సాల్లో వేలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఎంతోమంది కొంపాగోడూ అన్నీ కోల్పోయి వీధినపడ్డారు. ఇళ్ళల్లోకి నీళ్ళొచ్చేయడంతో పిల్లాపాపలతో, కట్టుబట్టలతో బతుకుజీవుడా అంటూ ఎందరో అతికష్టమ్మీద బతికి బయటపడ్డారు. ముఖ్యంగా పెన్నానది పరీవాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజల పరిస్థితి అతలాకుతలమైంది. ఈ దుస్థితిలో ప్రజలను ఆదుకునేందుకు జిల్లా అధికారయంత్రాంగం వెంటనే తగు చర్యలు చేపట్టడంతో పాటు, పోలీసుశాఖ వారు అనేకమందిని కాపాడారు. జిల్లాలోని అనేకమంది దాతలు, కొంత మంది నాయకులు, రెడ్‌క్రాస్, రోటరీ, లయన్స్ క్లబ్, ఇతరత్రా స్వచ్ఛంధసేవకులు వరద బాధితులను ఆదుకునేందుకు చేస్తున్న సేవలు ఎంతైనా అభినందనీయం!.. ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వం. ఆ మానవీయమూర్తులందరికీ ధన్యవాదాలు!...

**బి.వెంకటేశ్వర్లు, పడుగుపాడు.**







## రమణీయం.. కమనీయం

# నిహారిక - రవితేజల పరిణయం

## కన్నులపండువగా జరిగిన వెంకయ్య మనుమరాలి మనువు

భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు - శ్రీమతి ఉషమ్మల మనుమరాలు ముప్పవరపు **నిహారిక - రవితేజ**ల కళ్యాణం సాక్షాత్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరుడే కొలువైన వేదికపై, సుసంప్రదాయ వేడుకగా, రమణీయంగా, కమనీయంగా జరిగింది. హైదరాబాద్‌లోని జిఎంఆర్ ఎరీనాలో డిసెంబర్ 9వ తేదీ గురువారం సాయంత్రం 7 గంటలకు మొదలైన వధూవరుల పరిచయ కార్యక్రమం 10.00 గంటలకు ముగిసింది. 10.45 నిముషాలకు మొదలైన వివాహవేడుక రాత్రి 1.30 వరకు జరిగింది. కార్యక్రమం మొత్తం భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా జరిపించింది ముప్పవరపు కుటుంబం.

వెంకయ్య - ఉషమ్మ దంపతులతో పాటు వధువు తాతయ్య, అమ్మమ్మలు చంద్రమోహన్ బెనర్జీ - చంద్రకుమారి, వధువు నిహారిక నాన్న, అమ్మలు హర్షవర్ధన్ - రాధ, వరుడు రవితేజ అమ్మా, నాన్నలు మాధురీదేవి - లక్ష్మణరావులు కార్యక్రమ ఆసాంతం వచ్చిన ప్రతి అతిథినీ సాదరంగా ఆహ్వానించారు పలకరించి పులకరింప చేశారు.

కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్రాల మంత్రులు, గవర్నర్లు, అతిరథ మహారథ పారిశ్రామిక దిగ్గజాలు, రాజకీయ ప్రముఖులు, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, వెండితెర హీరోలు, మీడియా అధినేతలతో పాటు రెండు కుటుంబాల ఆప్తులు, ఆత్మీయులు, బంధుమిత్రులు పాల్గొని కొత్త దంపతులను దీవించారు.

ఆడంబరం అనిపించకుండా, కోలాహలం కనిపించకుండా వెంకయ్య మార్కు క్రమశిక్షణతో అత్యంత ప్రశాంతంగా అంగరంగ వైభవంగా ఈ పెళ్ళి జరిగింది. నిహారిక - రవితేజలకు 'లాయర్' శుభాశీస్సులు.































# 73 కేజీల గంజాయిని పట్టుకున్నారు

## - నలుగురిని అరెస్ట్ చేశారు



జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సెబ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. సెబ్ జేడీ శ్రీలక్ష్మి ఆదేశాలతో జాతీయ రహదారులపై వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద నెల్లూరు నుంచి ఆర్టీసి బస్సులో తమిళనాడు, కేరళ ప్రాంతాలకు గంజాయి అక్రమరవాణాకు పాల్పడుతున్న నలుగురు ముఠాసభ్యులను పట్టుకుని, వారి వద్ద నుంచి 73.50 కేజీల గంజాయిని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు నుంచి తమిళనాడుకు వెళ్తున్న ఆర్టీసి బస్సులో అనుమానాస్పదంగా ఉన్న కేరళ రాష్ట్రం తిరువనంతపురం వలక్కడువు ప్రాంతానికి చెందిన ప్రవీణ్ ఫ్యాన్సిస్, అనిల్ విజయన్, మహ్మద్ ఆలీ, చెన్నైకి చెందిన మోహన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఆ గంజాయినంతా స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ దాదాపు 7.38 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాకు మరోవ్యక్తి సూత్రధారిగా ఉన్నట్లు తెలుస్తోందని, ఆ వ్యక్తి కోసం గాలిస్తున్నామని సెబ్-2 పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సెబ్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, ఏఇఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకున్న సెబ్ నెల్లూరు-2 ఇన్స్‌పెక్టర్ వి.వెంకటేశ్వర్‌రావు, ఎస్‌ఐ శకుంతలాదేవి, సిబ్బంది సాయిబాబు, పెంచలయ్య, మల్లికార్జునరావు, మోహన్‌లను ఈ సందర్భంగా ఏసీ రవికుమార్ అభినందించారు.

# బ్రహ్మశ్రీ విశ్వనాథశ్రౌతుల జయంతి



నెల్లూరు నగరంలోని టీవీఎస్ కళ్యాణ్ సదన్‌లో బ్రహ్మశ్రీ విశ్వనాథ శ్రౌతుల వారి 101వ జయంతి సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తొలుత గణపతి పూజ, కలశ స్థాపన చెన్నై వేదపండితులు బండాత్మకూరు సత్యవరకుమార్‌శర్మ ఘనాపాటీ, నారాయణశర్మ ఘనాపాటీ, హరిహరన్‌శర్మ ఘనపాఠీలచే కృష్ణ యజుర్వేద పారాయణం నిర్వహించారు. బ్రహ్మశ్రీ భట్టారం శ్రీనివాసశాస్త్రి శర్మ శాంతి మంత్ర పఠనం గావించారు. వీరిని నగర ప్రముఖులు, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చంద్రమౌళి, టీవీఎస్ కళ్యాణ్ సదన్ అధ్యక్షులు ఫణికుమార్‌లను విశ్వనాథ శ్రౌతుల శిష్య బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశ్వనాథ్ శ్రౌతులవారు వేద పండితులుగా నెల్లూరు నగరానికే కాకుండా దేశం నలుమూలల శృంగేరిమఠం నుంచి కాశ్మీరం దాకా ఎన్నో వైదిక కార్యక్రమాలు నిర్వహించి అనేకమంది శిష్యులకు వేదం బోధించారని కొనియాడారు. అనంతరం, ప్రస్తుతం స్థానిక బాలాజీనగర్‌లో వారి పేరుతో నిర్వహిస్తున్న వేద పాఠశాల విద్యార్థులకు బోధన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరులోని గురుకృప నాట్యసంస్థ అధినేత్రి శ్రీమతి సురభి గాయత్రి శిష్యబృందం నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో బండాత్మకూరు రామచంద్ర శర్మ, మాచవోలు భాస్కరశర్మతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### శబరి శ్రీరామక్షేత్రంలో..

# హనుమాన్ చాలీసా పారాయణం

## లక్ష తమలపాకులతో స్వామివారికి ప్రత్యేకపూజలు



నెల్లూరు దర్గామిట్టలోని రామ్‌నగర్‌లో ఉన్న శ్రీ శబరి శ్రీరామక్షేత్రంలో ఈనెల 12వ తేది నుంచి 3 రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన హనుమాన్ చాలీసా పారాయణం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. హనుమద్వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేకించి విజయవాడ నుంచి అఖిలభారత హనుమద్దీక్ష పీఠానికి చెందిన హనుమాన్ భక్తబృందాన్ని ఆహ్వానించి ఈ కార్యక్రమం నిర్వహించడం విశేషం. 72గంటల పాటు అత్యద్భుతంగా జరిగిన హనుమాన్ చాలీసా అఖండ పారాయణంలో అనేకమంది రామభక్తులు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు. 15వ తేది సాయంత్రం దాకా జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు. 16వతేదీ ఉదయం ఆలయంలోని ఆంజనేయస్వామి మూలవర్లకు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. లక్ష తమలపాకులతో పూజలుచేసి అనంతరం భక్తులందరికీ స్వామివారి ప్రసాదాలను పంచిపెట్టారు. సాయంత్రం 4గంటలకు ఆలయం చెంతనున్న శ్రీరామకోటి స్థూపంలో రామకోటి గ్రంథాలను నిక్షిప్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రక్తదానమంటే..

# ప్రాణదానమే

## - మేయర్ స్రవంతి

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానాన్ని ప్రోత్సహించి బాధితులను కాపాడాలని నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. ఈనెల 12న ఆమె నగరంలోని ధనలక్ష్మీపురంలో హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానశిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 181 మంది రక్తదానం చేశారని అంటూ, రక్తదానం చేసిన వారందరినీ ఆమె అభినందించారు. రక్తదానం పట్ల అందరిలో చైతన్యం పెరగాలన్నారు. ఈ శిబిరంలో అనేకమంది యువకులు పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఛైర్మెన్ కుంచాల విజయభాస్కర్, నాయకులు కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పవన్,రవి, వెంకటరెడ్డి, వినయ్, నవీన్, శివాజీ యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు మోపూరు భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### జడ్పీ స్థాయీ సంఘాల సభ్యుల ఎన్నిక..

# డిసెంబరు 18న

జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల ఎన్నికల ప్రక్రియ ఈనెల 18న నిర్వహిస్తామని జడ్పీ సిఇఓ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ప్రణాళిక, ఆర్థిక విషయాల స్టాండింగ్ కమిటీ ఎన్నికలతోపాటు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, స్త్రీ శిశుసంక్షేమం, సాంఘిక సంక్షేమం, నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

# క్రీడాకారులకు స్పోర్ట్స్ షూలు

స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ షూ, సాక్సులు అందజేస్తామని, 2019-20 విద్యాసంవత్సరంలో వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన క్రీడాకారులు, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నవారు అర్హులని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.దేవిక తెలిపారు. క్రీడాకారులు తమ సర్టిఫికెట్లతో ఈనెల 20వ తేదీలోపు నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సంప్రదించాలని, వివరాలకు 95814 47572, లేదా 99898 03384 నెంబర్లకు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

### భక్తి శ్రద్ధలతో..

# దత్త జయంతి

నెల్లూరులోని సాయి భరద్వాజ సత్సంగ బృందం ఆధ్వర్యంలో ఈనెల 12 ఘనంగా దత్త జయంతి జరిగింది. నెల్లూరు పురమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్కిరాల భరద్వాజ కుమార్తె ఆడిదం వేదవతి పాల్గొని గురుచరిత్ర విశిష్టతపై ఉపన్యసించడం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

### ప్రజల సమస్యలను

# వెంటనే పరిష్కరించాలి

## - కలెక్టర్



'స్పందన' గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీని నిర్దేశిత గడువు లోపల తప్పనిసరిగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్లు హరేందిర ప్రసాద్, విదేహ్ ఖరే, జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేసు తదితర అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

**విద్యుత్ పొదుపుపై దృష్టి సారించాలి :**

ఈనెల 14వ తేది నుండి 20వ తేది వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అధికారులకు తెలిపారు. వ్యాక్సినేషన్ ప్రక్రియలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానం సాధించిందని, అన్ని శాఖల సమన్వయంతో ఇది సాధ్యమైందని కలెక్టర్ అంటూ, ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపుపై ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గాని, ఇళ్ళల్లో గాని అవసరం ఉన్నవరకే విద్యుత్‌ను వినియోగించాలని, వర్క్ అయిన వెంటనే విద్యుత్‌ను ఆపాలని సూచించారు. విద్యుత్ శాఖ ఎస్‌ఇ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

**మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు..**

**అంతర్గత ఫిర్యాదుల కమిటీలు**

ప్రతి కార్యాలయంలోనూ మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నియంత్రణ కోసం 2013 సంవత్సరంలో లైంగిక వేధింపుల నివారణ చట్టం (నివారణ, నిషేధం, దిద్దుబాటు)-2013ను ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాల్సిన బాధ్యత ఆయా శాఖల జిల్లా అధికారులపై ఉందని కలెక్టర్ అన్నారు. ఈ చట్టాన్ని అనుసరించి పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి కార్యాలయంలోనూ అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు అన్న తేడా లేకుండా కనీసం పది మంది ఉద్యోగులు ఉన్న ప్రతి కార్యాలయంలోనూ అంతర్గత వేధింపుల కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేసి, అందుకు సంబంధించిన వివరాలను ఐసీడీఎస్ కార్యాలయానికి పంపాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయాల్లో సైతం ఈ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా సచివాలయ మహిళా ఉద్యోగులు, మహిళా వాలంటీర్లకు పనివేళల్లో భరోసా పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ (ఆసరా), ఐసీడీఎస్ పీడీ రోజ్‌మాండ్, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం గురించి అందరికీ వివరించారు. జడ్పీ సిఇఓ శ్రీనివాసరావు, డిపిఓ ధనలక్ష్మి, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బిపిన్‌కు.. ఘన నివాళి



ఇటీవల హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన భారత తొలి త్రిదళాధిపతి, రక్షణరంగ మహాయోధుడు బిపిన్ రావత్ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ నెల్లూరీయులు జోహార్లర్పించారు. ఈ ప్రమాదంలో మరణించిన అమరవీరులకు పలు సంస్థల వారు శ్రద్ధాంజలి ఘటించారు. నెల్లూరులోని గీతామయి వృద్ధాశ్రమంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు బిపిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి బిపిన్‌కు ఘనంగా నివాళులర్పించారు. నెల్లూరులోని సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్ విద్యార్థులు స్థానిక విఆర్‌సి సెంటర్‌లో బిపిన్‌రావత్‌కు నివాళులర్పించారు. ఆ స్కూల్ డైరెక్టర్ వెంకటాద్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు విద్యార్థులతో ప్రదర్శనగా వెళ్ళి కొవ్వొత్తులు వెలిగించి బిపిన్ సేవలను స్మరించుకున్నారు. అమరవీరులకు నెల్లూరులోని ఏబివిపి జిల్లా నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆ సంఘం జిల్లా ఛైర్మెన్ మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత ప్రదర్శనగా విఆర్‌సి సెంటర్‌కు వచ్చి కొవ్వొత్తులు వెలిగించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆ మహాయోధుల సేవలను గుర్తుచేసుకున్నారు. ఏబివిపి నాయకులు వెంకటస్వామి, చెంచురామయ్య, ఎన్ ఆంజనేయవర్మ, ఎల్ పెంచలయ్య, ఎన్ మధు తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ దాత - నిష్కళంక నేత

# జేకే రెడ్డి @ 80



### డిసెంబర్ 23న 81వ పడిలో అడుగిడుతున్న జక్కా కోదండరామిరెడ్డి

*జేకే అంటే ఓకే. ఇది ఇప్పటి మాట... కాదు మూడున్నర దశాబ్దాలకుపైగా నెల్లూరుజిల్లాలో వినిపిస్తున్న మాట. తన వద్దకు ఎవరు ఏ పనిమీద వచ్చినా... అడిగిందే తడవుగా వచ్చిన వారికి తనకు చేతనైన సహాయం చేయడం ఆయనకు ఉన్న సహజగుణం. మంచితనం, మానవత్వం, నిస్వార్థ దాతృత్వం, నిష్కళంక నాయకత్వం వంటి మంచి లక్షణాలు కలిగిన సకల సద్గుణాభిరాముడు మాజీ శాసనసభ్యులు, సీనియర్ రాజకీయవేత్త, జేకే రెడ్డిగా ఖ్యాతి పొందిన జక్కా కోదండరామిరెడ్డి. డిసెంబర్ 23వ తేదీన ఆయన 80 వసంతాలు పూర్తి చేసుకుని 81వ యేట అడుగిడబోతున్నారు.*

జక్కా రంగారెడ్డి - కామేశ్వరమ్మల రెండవ కుమారుడిగా 1941, డిసెంబర్ 23న రైతు కుటుంబంలో జన్మించారు కోదండరామిరెడ్డి. బాల్య విద్యాభ్యాస మంతా స్వగ్రామం జగదేవిపేటలోనే. ఓవైపు చదువుకుంటూనే నాన్నకు వ్యవసాయంలో సాయం చేసేవారు. ఇరవై రెండేళ్ల ప్రాయంలోనే వాసా వారి ఆడ పడుచు సులోచనని 1963లో పెళ్లి చేసుకున్నారు. ఆ తరువాత పదేళ్లకు అంటే ఆయన 32వ ఏట 1973లో తన దృష్టిని కాంట్రాక్టు రంగం వైపు సారించారు. అప్పటికే తన మేనమామ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి, సోదరులు జక్కా శ్రీనివాసులరెడ్డి, ఆదాల రాఘవరెడ్డి, ప్రభాకర రెడ్డి ఆ రంగంలో ఉన్నారు. సహజంగానే బాగా కష్టపడి పనిచేసే నైజం, అందరితో త్వరగా కలిసిపోయే గుణం, ఏ విషయాన్నైనా వెంటనే అర్థం చేసుకోగలిగే సమర్థత ఉండడంతో అనతికాలంలోనే కాంట్రాక్టు రంగంలో మంచి నైపుణ్యతను సాధించారు కోదండరామిరెడ్డి.

కొన్నాళ్లకు తన స్వంతపేరు మీద జేకే కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థను స్థాపించారు. కన్నవారికీ, కట్టుకున్న ఇల్లాలికి, తాను కన్న బిడ్డలకి దూరంగా తన వ్యాపార ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నప్పటికీ.. ఆయన తన జన్మభూమిని మరువలేదు. తన సోదరులందరూ బెంగళూరు, హైదరాబాదు, చెన్నై వంటి మహానగరాలలో స్థిరపడుతుంటే ఆయన మాత్రం నెల్లూరులోనే తన స్థిర నివాసం ఏర్పరచుకుని తన బిడ్డలను ఇక్కడే చదివించారు. ఒకవైపు తన కాంట్రాక్టు ప్రయాణాన్ని కొనసాగిస్తూనే నెల్లూరులో సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేవారు. కళ, సాహిత్య రంగాలకు చేయూత నిచ్చేవారు. జక్కా కోదండరామిరెడ్డి నుండి జేకే రెడ్డిగా ప్రాచుర్యాన్ని పొందారు. ఆయన ఊర్లో ఉన్నారంటే ఆయనను కలవడం కోసం నిత్యం పదుల సంఖ్యలో జనం ఆయన ఇంటి ముందు క్యూ కట్టే స్థాయిలో జిల్లాలో గుర్తింపును సాధించుకున్నారు. ముఖ్యంగా ఆ రోజుల్లో నెల్లూరు నగరంలో జేకే రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనకుండా ఎలాంటి కార్యక్రమాలూ జరిగేవి కాదంటే అతిశయోక్తి కాదేమో. ఆయన వచ్చేవరకు వేచి ఉండి ఆయన ఇచ్చే డేట్ ప్రకారంగానే అనేక సంస్థలు తమ కార్యక్రమాలను జరుపుకునేవి.

#### రాజకీయాలపై దృష్టి...

నిత్యం ప్రజలలో ఉండడమంటే జేకే రెడ్డికి ఇష్టం. సేవా, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడమంటే ఆయనకు ఆసక్తి. ఆ దృక్పథమే ఆయనను రాజకీయాలవైపు దృష్టి సారించేలా చేసింది. తెలుగు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కొత్తగా ఆవిర్భవించి ప్రాచుర్యాన్ని పొందుతున్న తరుణంలో జిల్లా కాంగ్రెస్‌లో ఆశా కిరణంలా మెరిశారు జేకే రెడ్డి. ఆయనకు కాంగ్రెస్‌పార్టీ అంటే అభిమానం. తన చిన్ననాటి నుండి గ్రామీణ రాజకీయాలలో ఎక్కువగా కాంగ్రెస్‌పార్టీ పేరుతో పాటు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేరు ఎక్కువగా వినపడుతుండడంతో జేకే రెడ్డి కూడా ఆమెకు వీరాభిమానిగా మారారు. ఆ అభిమానం ఏ స్థాయిలో ఉండేదంటే తన మనుమరాలు (కూతురు పద్మజ కుమార్తె)కి ఆయన ప్రియదర్శిని అని ఇందిరా ప్రియదర్శిని పేరును పెట్టుకున్నారు. అనతికాలంలోనే జిల్లా కాంగ్రెస్ పార్టీలో విశేష గుర్తింపును సాధించారు. 1987లో జిల్లా పరిషత్ ఎన్నికలలో పోటీచేసి ఓటమి పాలయ్యారు. అయితే ఆ ఎన్నిక జిల్లా రాజకీయ రంగంలో జేకే రెడ్డి ఛరిష్మాని బాగా పెంచింది. 1989 సారస్వత ఎన్నికల నాటికి ఆయన జిల్లా కాంగ్రెస్‌పార్టీలో కీలక నేతగా ఎదిగారు. ఈ ఎదుగుదలే 1989 ఎన్నికలలో ఆయనకు టిక్కెట్టు రాకుండా స్థానిక నేతలు అడ్డుకునేలా చేసింది. అయితే జేకే రెడ్డి ప్రాభవాన్ని ఎవరూ అడ్డుకోలేకపోయారు. 1989 ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా ఉదయ సూర్యుడి గుర్తుపై నెల్లూరు నగరం నుండి పోటీచేసి అఖండ విజయం సాధించారు జేకే రెడ్డి. ఆ ఎన్నిక తరువాత ఆయన రాష్ట్ర రాజకీయాలలో సైతం విశేష గుర్తింపును సాధించారు. ఒక విధంగా ఆయనకు టిక్కెట్టు రాకుండా స్థానిక నేతలు అడ్డుకోవడం ఆయనకు రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడానికి దోహదపడిందని చెప్పొచ్చు. అందుకే పెద్దలు చెప్పినట్లుగా, మనం ఊహించని కొన్ని సంఘటనలు జరిగినప్పుడు అంతా మన మంచికే అనుకోవాలి.

#### పాలిటిక్స్‌లో కలిసిరాని మంచితనం...

రాజకీయాలలో మంచితనం, మెతక స్వభావం కలిసిరావనడానికి జేకే రెడ్డి పెద్ద ఉదాహరణ. ఆయన శాసనసభ్యుడైన అనతికాలంలోనే నగర అభివృద్ధిపై దృష్టి పెట్టారు. తనకున్న విశాలదృక్పథంతో కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెచ్చారు. కూరగాయల మార్కెట్టును ఇరుకు సందులనుండి విశాల ప్రాంగణంలోకి తరలింపచేశారు. ఇప్పుడు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మినీబైపాస్ అప్పటి జేకే రెడ్డి ప్రయత్న ఫలితమే. కేవలం ప్రభుత్వ పథకాల అమలులోనే కాకుండా ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమం ఏదైనా ఆయన ముందుండేవారు. అవసరమైతే తన సొంత నిధులను కూడా వెచ్చించడానికి ఆయన వెనుకంజ వేసేవారు కాదు. 1989 - 1994 మధ్య అయిదేళ్ళ కాలంలో జేకే రెడ్డి పేరు మారుమ్రోగిపోయింది. ఆయన దూకుడు చూసి తట్టుకోలేని ఆనాటి కాంగ్రెస్ నాయకులు మాగుంట సుబ్బరామిరెడ్డిని పావుగా వాడి 1994లో నగర అభ్యర్థిగా పి.వి.ప్రసన్న రెడ్డిని ప్రతిపాదించి జేకే రెడ్డిని పక్కన పెట్టారు. తాను త్యాగంచేసి ఇచ్చిన సీటులో ప్రసన్న ఓడిపోయి, తాళ్ళపాక రమేష్‌రెడ్డి విజయం సాధించారు. అదే జేకే రెడ్డి అయ్యుంటే ఖచ్చితంగా గెలిచుండేవారు. ఆ తరువాత మంచి చెడులు సూచిస్తూ నిత్యం తనకు మార్గదర్శకత్వం చేసే తన ఆత్మబంధువు తుంగా రాజగోపాలరెడ్డి 1995 జనవరిలో దివంగతులు కావడం, అదే ఏడాది డిసెంబరులో తనకు అత్యంత ఆప్తుడైన మాగుంట సుబ్బరామరెడ్డి హత్యకు గురికావడం వంటి సంఘటనలు జేకే రెడ్డిని తీవ్ర మనస్తాపానికి గురిచేశాయి. ప్రజాసేవలో మాత్రమే కొనసాగుతూ రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. మళ్ళీ 1999లో తన స్నేహితుడు, హితుడు, సన్నిహితుడు దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి పిసిసి అధ్యక్షుని హోదాలో తనను కోవూరు నుండి పోటీ చేయమని అడగడంతో ఇష్టం లేనప్పటికీ మిత్రుడి మాట కాదనలేక అక్కడ నుండి పోటీ చేశారు జేకే రెడ్డి. అక్కడ ఓడిపోయినప్పటి నుండి క్రమేణా ఆయన రాజకీయాలకు దూరమయ్యారు. ఒక విధంగా చెప్పాలంటే మనస్తాపం చెంది ఆ రంగం నుండి విరమించారనే చెప్పొచ్చు.

జేకే రెడ్డికి తెలిసింది ఒక్కటే... మంచితనం, మానవత్వం, నైతిక విలువలు, సామాజిక సేవలు. కానీ రాజకీయాలంటే కుట్రలు, అవినీతి, అక్రమాలు, అబద్ధాలు, దుర్మార్గాలు, దోపిడీలు, దౌర్జన్యాలు... వీటన్నిటిలో ఒక్కటి కూడా జేకే రెడ్డికి చేతకావు, అందుకే రాజకీయాలు ఆయనకు సూటు కావు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న రాజకీయాలకైతే ఆయన అస్సలు సరిపోరు. ఎందుకంటే ఆయన నిష్కళంక నేత - నిస్వార్థ దాత.

రాజకీయాలకు దూరంగా, కుటుంబానికి దగ్గరగా, మిత్రులతో, ఆత్మీయులతో, అభిమానులతో కాలక్షేపం చేస్తూ ఆనందమయ జీవితం గడుపుతున్న జేకే రెడ్డి 80వ జన్మదినం (డిసెంబర్ 23) సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతోంది 'లాయర్'.

## శ్రీసిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

శ్రీసిటీలోని కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇటీవల తడలోని గ్రామ పంచాయతి కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి పలు గ్రామాలకు చెందిన 184 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్యానికి సంబంధించి సూచనలిచ్చారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్, కావేరి హాస్పిటల్, కేర్ డెంటల్ ఇంటర్నేషనల్ సెంటర్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.




ఈ సందర్భంగా విద్యార్థులకు పేస్ట్, బ్రష్, మౌత్‌వాష్‌లు ఉచితంగా అందజేశారు. డాక్టర్ సుధాకర్, డాక్టర్ శ్రీనివాస్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సంగీత సంరంభం














నెల్లూరోళ్ళు ఏ పనిచేసినా తమదైన స్టైల్లో ఉంటుందని మరోసారి నిరూపించారు నూకలపాటి అనిల్ – పార్వతి దంపతులు. తమ పెద్ద కుమారుడు **అనుత్తమ్ - మానస**ల కళ్యాణం వైభవాన్ని అత్యంత వైభోగంగా జరిపించి ఔరా అనిపించారు. డిసెంబర్ 12వ తేది ముహూర్తానికి డిసెంబర్ 2వ తేదీ నుండే అనిల్ – పార్వతిల ఇల్లు 'నార్ హౌస్' ముస్తాబయ్యింది. ఓపెన్‌హౌస్ పేరుతో రెండవ తేదీ నుండే అతిథులకు ఆతిథ్యం ఇవ్వడం ప్రారంభించారు. డిసెంబర్ 10వ తేదీ నార్ హౌస్‌లో జరిగిన 'మెహెంది' వేడుకలో ముంబైకి చెందిన పాప్ సింగర్లు ఆహుతులను అలరించారు.

డిసెంబర్ 11వ తేదీ హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగిన 'సంగీత్' మొత్తం వేడుకలోనే హైలైట్‌గా నిలిచింది. సుప్రసిద్ధ బాలీవుడ్ హీరో రణవీర్ సింగ్ ఈ సంగీత వేదికపై ఆకర్షణగా నిలచాడు. రణవీర్ వేదికపై ఉన్నంత సేపు ఆహుతులను అలరించిన తీరు అందరినీ అబ్బురపరచింది. 'జంగిల్' (అడవి) మూలాధారంగా ప్రాంగణాన్ని అలంకరింపజేశారు. సంగీత్ కార్యక్రమం ఆద్యంతం రంజింప చేసింది. రణవీర్ రాకతో ఆ ఉత్సాహం రెట్టింపయ్యింది. అనిల్ దంపతుల చిన్న కొడుకు ఆయుష్‌తో కలిసి పెళ్ళి కొడుకు అనుత్తమ్‌ని భుజాలపై మోయడం, అనుత్తమ్ – మానసలతో పాటు అనిల్ –పార్వతి, రాజఠాకుర్ – మనాలి దంపతులతో కలిసి రణవీర్ డాన్స్ చేసిన తీరు అందరిని ఆశ్చర్యపరచింది.

### ఆడంబర సంబరంగా జరిగిన

# అనుత్తమ్ - మానస కళ్యాణ వైభవం



### వైభోగంగా వివాహ వైభవం...

భారతదేశ సుప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఆధ్వర్యంలో జరిగిన పెళ్ళి వేడుకలో ప్రతీ అంశం ప్రత్యేకతను చాటుకుంది. హైటెక్స్ లాన్స్‌లో భారీ సెట్టింగులతో ప్రత్యేకంగా రూపొందించిన ప్రాంగణంలో అబ్బాయి, అమ్మాయి పెళ్ళి మండపంలోకి వచ్చే దగ్గర నుండి మాంగల్యధారణ జరిగేవరకు ప్రతీ విషయంలోనూ ఆధునికత ఉట్టిపడింది. 'నెవెర్ బిఫోర్ – ఎవర్ ఆఫ్టర్' అన్నట్లుగా అనుత్తమ్ – మానసలు ఒక్కటయ్యారు. భారతదేశంలో అత్యంత ధనవంతులైన ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, సెలెబ్రెటీల కుటుంబాల శుభవేడుకలకు ధీటుగా అనిల్, ఠాకూర్ కుటుంబాలు ఈ వేడుకను నిర్వహించి వారి సరసన చేరారు. పారిశ్రామికంగా, రాజకీయంగా, సామాజికపరంగా రెండు కుటుంబాల వారు బాగా పలుకుబడి, గుర్తింపు కలిగినవారు కావడంతో యావత్ భారతదేశానికి చెందిన అన్ని రంగాల ప్రముఖులూ ఈ వేడుకలలో పాల్గొని అనుత్తమ్ – మానసలను దీవించారు.

రణవీర్ సింగ్ ఆట పాట, మనీష్ మల్హోత్రా కళాత్మకతతో జరిగిన ఈ అపురూప వేడుకలో ఉభయ రాష్ట్రాల నుండే కాక ముంబై, ఢిల్లీ, కలకత్తా, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకు చెందిన ప్రముఖులతో పాటు అనిల్, రాజ్‌ఠాకూర్ కుటుంబాల బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, ఆప్తులు, ఆత్మీయులు పాల్గొని అన్నివేడుకలకు నిండుతనాన్ని తెచ్చారు. అనుత్తమ్ – మానసలకు 'లాయర్' శుభ దీవెనలు.

## వివాహ వైభోగం















# కళ్యాణ వైభోగం...!

ప్రదీప్ - కావ్యశ్రీ



ప్రముఖ న్యాయవాది కీర్తిశేషులు పి.వి.రమణారెడ్డి మనుమడు, అడ్వకేట్ పునూరు శ్రీనివాసులురెడ్డి - వినయల కుమారుడు **ప్రదీప్‌రెడ్డి - కావ్యశ్రీ**ల పరిణయం డిసెంబర్ 13వ తేదీ బెంగుళూరులో వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

సునీల్ - యాషిత



నెల్లూరుజిల్లా కోవూరు మండలం, వేగూరు వాస్తవ్యులు కీ॥శే॥ మాచవరం వెంకటేశ్వర్లు - శ్యామలల కుమారుడు **సునీల్‌కుమార్ - డా॥ యాషిత**ల కల్యాణం డిసెంబర్ 10వ తేదీ తిరుమలలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# సమస్యలపై గళమెత్తిన సభ్యులు

- వాడివేడి చర్చలతో తొలి జడ్పీ సమావేశం
- అర్హులకు పథకాలు అందాలన్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ





నూతన పాలకవర్గం ఎన్నికయ్యాక నెల్లూరు జడ్పీ తొలి సమావేశం ఈనెల11న సుదీర్ఘంగా జరిగింది. ప్రతిపక్షం అన్నమాటే లేకపోయినా, అధికారపక్షం సభ్యులు అనేక సమస్యలను ప్రస్తావించడంతో వాడివేడిగా చర్చలు జరిగాయి. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, అధికారులు ప్రజాప్రతినిధులందరి సహకారంతో జిల్లాను ప్రగతి పథంలో అగ్రగామిగా నిలుపుతామని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషిచేయాలని ఆమె అధికారులను కోరారు.

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, ఉపాధి హామీ పథకం అస్తవ్యస్తంగా మారిందని, మొక్కల పెంపకం పేరుతో కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయని, ఇదొక కుంభకోణంగా మారిందంటూ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై విచారణ చేయించాలని ఎమ్మెల్యే కాకాణి అధికారులను కోరారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోతుండడంతో అనేక అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయంటూ, ఏడాదిగా ఈ సమస్యతో బాధలు పడుతున్నామంటూ పలువురు సభ్యులు చెప్పడంతో సమావేశంలో చర్చ వాడివేడిగా జరిగింది. ఎమ్మెల్యే కాకాణి, కలెక్టర్ జోక్యం చేసుకుని బిల్లుల చెల్లింపుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కావలిలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, మరమ్మతులు చేయించాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కోరగా, రూరల్‌లో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. అనేక గ్రామాల్లో పరిశుభ్రమైన నీళ్ళు అందడం లేదని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. ఇంటింటికీ కుళాయి పథకం ఏమైందని పలువురు సభ్యులు అడిగారు. వైద్యశాఖ వారు గ్రామాల్లో ఏ సమస్యనూ పట్టించుకోవడం లేదంటూ ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. ఉదయగిరి పిహెచ్‌సిలో సమస్యలు తీర్చాలని అడిగినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. సభ్యులు అడిగిన అన్ని సమస్యలను జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్‌లు సావధానంగా విన్నారు. వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. తొలుత ఇటీవల హెలికాప్టర్ ప్రమాదంలో అసువులు బాసిన వీరసైనికులకు, దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు సమావేశం సంతాపం ప్రకటించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది. జేసీలు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, జడ్పీ సిఇఓ శ్రీనివాసరావు, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతి, ఆఫ్కాప్ ఛైర్మెన్ అనిల్‌బాబు, ఎన్‌డిసిసిబి ఛైర్మెన్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

**మంత్రుల గైర్హాజరు :** ఈ సమావేశానికి నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీతో పాటు జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు వచ్చారు కానీ జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రితోపాటు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలు కారణాలతో గైర్హాజరయ్యారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# గూడూరువాసికి అరుదైన గౌరవం

## ఏపీపీఆర్ డీఇఏ గౌరవాధ్యక్షులుగా షేక్ రియాజ్ అహ్మద్





గూడూరు వాసికి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా షేక్ రియాజ్ అహ్మద్‌ను ఆ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 12వ తేదీ తిరుపతిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణానికి చెందిన షేక్ రియాజ్‌అహ్మద్‌ను అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు సభికుల కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు. అలాగే రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. ఏపీ పీఆర్ డీఈఏ అధ్యక్షులుగా కే.రవీంద్ర, కార్యదర్శిగా రత్నప్రసాద్, ఫైనాన్స్ సెక్రటరీగా మురళీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉద్యోగుల సంఘం జేఏసీ ఛైర్మెన్ బండి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీపీఆర్ డీఇఏ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా షేక్ రియాజ్‌అహ్మద్‌ను ఎన్నుకోవడం సంతోషంగా ఉందని, గతంలో ఆయన ఈ సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా, జేఏసీకి రాష్ట్ర వైస్‌ఛైర్మన్‌గా పనిచేసి ఎన్నో పోరాటాలతో డిప్లొమో ఇంజనీర్ల అనేక హక్కులను సాధించుకోవడంలో ముఖ్యపాత్ర పోషించారని గుర్తు చేశారు. రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఉన్నతమైన పదవికి ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పంచాయతీ రాజ్ డిప్లొమో ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం రియాజ్ అహ్మద్‌ను ఏపీపీఆర్ డీఇఏ రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. ఏపీఎన్జీఓ సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీ.శివారెడ్డి, 13 జిల్లాల అసోసియేషన్ సభ్యులు, డిప్లొమో ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకంటి సేవలు అభినందనీయం

## ఘనంగా ఎస్.వి.రత్నం శతజయంతి వేడుకలు





జన్మనిచ్చిన తల్లిదండ్రులను స్మరించుకుంటూ పేద ప్రజలకు సహాయం అందిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా ప్రముఖ ఆడిటర్, ఎస్.వి.రత్నం చారిటబుల్ ట్రస్టు ఛైర్మెన్, బ్రాహ్మణ సేవాసంఘం గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు సేవా కార్యక్రమాలు భావితరాలకు ఆదర్శం కావాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మలు తెలియజేశారు.

గూడూరు పట్టణంలోని సాయిబాబా మందిరంలో ఎస్.వి. రత్నం శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకంటి రామ్మోహన్‌రావు వారి తండ్రి ఎస్.వి.రత్నం శత జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ఆయన సేవా కార్యక్రమాలలో భాగంగా ఇందిరానగర్ స్కూలుకు 2 లక్షలు, సరస్వతి శిశు మందిరం విద్యార్థులకు పుస్తకాలకు 6000, వివేకా స్కూల్ విద్యార్థులకు 15,000, విజేత స్కూలు విద్యార్థులకు 10,000 ఫీజు నిమిత్తం, హైదరాబాద్‌లోని ఆర్ఫనైజ్ స్కూలుకు రూ.26,000లు, ఆంధ్ర యూనివర్శిటి బిటెక్ విద్యార్థి కళ్యాణ్‌కు హాస్టల్ ఫీజు 5,000, విశ్వహిందూ పరిషత్ భగవద్గీత పోటీల మెమెంటోలకు రూ.10,000, మానవతా సంస్థకు 25,000 ఇచ్చారని, వారికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఇవి కాకుండా క్యాన్సర్, పెరాలిసిస్ పేషెంట్లకు కూడా సహాయం చేస్తున్నట్లు తెలిపారు. కరోనా కాలంలో, వరద సమయంలో విశేష సేవలు అందించిన గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి, టౌన్ సి.ఐ నాగేశ్వరమ్మ, మనుబోలు, చిల్లకూరు, సైదాపురం, గూడూరు రూరల్ ఎస్.ఐ, టౌన్ ఎస్.ఐ, ఓజిలి ఎస్సైలను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ముందుగా త్రిదళపతి తొలి సీడీఎస్ బిపిన్ రావత్‌కు సభలో రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అలాగే 65మంది పూజారులకు, నిరాశ్రయులకు బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు శ్రీకంటి రామ్మోహన్‌రావు కుటుంబ సభ్యులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీకంటి రామ్మోహన్‌రావు సతీమణి పిఎస్ రాజ్యలక్ష్మి, వారి కుటుంబసభ్యులు, వైకాపా సిఇసి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, రోహిణి, పొణకా శివకుమార్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు, రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అన్నదానం



నెల్లూరులోని పప్పులవీధిలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఇటీవల చెంచు మహాలక్ష్మి క్యాటరింగ్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. క్యాటరింగ్ నిర్వాహకుడు పైడా హేమంత పర్యవేక్షణలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. ఇప్పటిదాకా తాము 35 వారాల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని, భగవంతుని ఆశీస్సులతో మొత్తంగా 108 వారాల పాటు అన్నదానం చేసి పేదల ఆకలి తీర్చాలన్నదే తమ ఆకాంక్ష అని ఆయన పేర్కొన్నారు.

# అయ్యప్పస్వామికి విశేష పూజలు



నెల్లూరు నగరంలోని అయ్యప్పస్వామి గుడిలో ఇటీవల మండల పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి శోభాయమానంగా అలంకారాలు చేసి విశేష పూజలు చేశారు. అయ్యప్ప స్వామికి పాలాభిషేకం, మహాగణపతి హోమం , శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ పూజలకు ఉభయకర్తలుగా బట్టిపాటి శ్రీనివాస్ రెడ్డి-స్నేహలతమ్మ దంపతులు వ్యవహరించారు. దేవస్థానం అధ్యక్షులు శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కత్తి మోహన్‌రావు, బొగ్గుల మురళి మోహన్‌రెడ్డి పలువురు కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



ఇటీవల జిల్లాలోని వరద ప్రాంతాల్లో పర్యటించిన సీఎం జగన్‌ను పుష్ప గుచ్ఛంతో ఆహ్వానించిన గూడూరు వైసిపి నేత నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, సీఎం పర్యటన ఆసాంతం ఆయన వెంటే ఉన్నారు.

# విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సాయం



ఇటీవల జిల్లాలో సంభవించిన వరదలకు నష్టపోయిన బాధితులకు నెల్లూరు జిల్లా రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నేతలు సాయం చేశారు. ఈనెల 15న వారు కలెక్టర్‌ను కలసి సుమారు 50 వేల రూపాయలు విలువచేసే 400 దుప్పట్లను బాధితుల కోసం అందజేశారు. వరదబాధితులకు తమవంతు సేవలందించిన రెవిన్యూ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ముత్యం నరసింహులు, వేలూరు శ్రీనివాసులు, వరిగొండ కృష్ణారావులను కలెక్టర్ అభినందించారు.

# అమరజీవి త్యాగం అపూర్వం

దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికిన స్వాతంత్ర సమర యోధుడు, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి అపూర్వమని జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు కొనియాడారు. ఈనెల 15న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. పొట్టి శ్రీరాములు పోరాటపటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు తాము చేస్తున్నది ప్రజాసేవగా భావించి, తమ వద్దకు వస్తున్న ప్రజలపట్ల ప్రేమ, సానుభూతితో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత శ్రీ పొట్టి శ్రీరాములు జీవిత విశేషాలను డిఆర్‌ఓ చిన్న ఓబులేసు వివరించారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దాస్, ఇంచార్జ్ బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, బిసి కార్పొరేషన్ ఇడి బ్రహ్మానందరెడ్డి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు సుధాకర్, కృష్ణయ్య, తేజోవతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరులో భగవద్గీత కంఠస్త పోటీలు



గూడూరు, శ్రీ సరస్వతి శిశు మందిరం నందు ఈ నెల 12వ తేదీ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీతలోని 17వ అధ్యాయం కంఠస్థ పోటీలు జరిగాయి. ఈ పోటీలోఎల్‌కెజి నుండి మూడో తరగతి వరకు చిన్నారులకు పది శ్లోకాలు, నాలుగో తరగతి నుండి ఏడో తరగతి వరకు 15 శ్లోకాలు, ఎనిమిదవ తరగతి నుండి పదో తరగతి వరకు ఇరవై శ్లోకాల్లో పోటీ జరుగగా విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వడం జరిగింది. పాల్గొన్న ప్రతి ఒక్కరికి అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు ఎం.మురళిరెడ్డి, ఉపాధ్యక్షులు డివి రమణారెడ్డి, కార్యదర్శి సిహెచ్.వెంకటరమణయ్య, కోశాధికారి ఆర్.రవిచంద్రరెడ్డి, ప్రకాండ అధ్యక్షులు జోసెఫ్, కార్యదర్శి రామ్మూర్తి, కార్యకర్తలు సిహెచ్.వెంకటరమణయ్య, ఐ.ఆనంద్‌రావు, జి.మునికోటేశ్వరరావు, ఆర్.లావణ్య(రామా ఆచార్య), కె.సుబ్బారావు, ప్రసాద్,రాజేంద్ర,రమేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# సంగం వద్ద ఘోర ప్రమాదం

- లారీ ఢీకొని..బీరాపేరు వాగులో పడ్డ ఆటో
- నలుగురి మృతి..మరో ఇద్దరు గల్లంతు
- ఆలయంలో నిద్ర చేయాలని వెళ్ళి..శాశ్వత నిద్రలోకి!



బీరాపేరు వాగులో పడవపై వెళ్తూ గల్లంతైన వారికోసం గాలింపు చేపట్టిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

***మృత్యువు ఎప్పుడు ఎలా వస్తుందో ఎవరికీ తెలియదు. విధి రాతను ఎవరూ తప్పించలేరు.. అన్నట్లుగానే ఇటీవల సంగం వద్ద జరిగిన ప్రమాదం అందరినీ కంటతడి పెట్టించింది. కుటుంబపెద్ద కర్మక్రియలు పూర్తిచేసుకుని సంప్రదాయం మేరకు ఆలయంలో నిద్రచేసేందుకు ఆటోలో వెళ్తున్న ఆ కుటుంబసభ్యులను విధి వెంటాడిది. ఆ కుటుంబాన్ని విషాదంలో ముంచింది. వారు వెళ్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో వెళ్లి పక్కనే నిండా నీళ్ళతో ప్రవహిస్తున్న బీరాపేరు వాగులో పడిపోయింది. ఆటోలో ఉన్న 12 మందిలో ఏడుగురు బయటపడినా, వారిలో ఒక బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. అయిదుగురు ప్రవాహంలో గల్లంతయ్యారు. వీరిలో మరో ముగ్గురు మృతిచెందారు. మిగిలిన వారికోసం గాలింపు జరపగా ఆ తర్వాత మరో ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగిలిన ఇద్దరి మహిళల జాడ ఇప్పటికీ తెలియలేదు. ఈనెల 16న కూడా గాలింపు కొనసాగుతూనే ఉంది. మండల కేంద్రమైన సంగం సమీపంలో నెల్లూరు-ముంబై రహదారిపై జరిగిన ఈ దుర్ఘటన జిల్లా ప్రజలను కలచివేసింది.***


ఆత్మకూరులో తమ కుటుంబపెద్ద కర్రా నాగేంద్ర ఇటీవల మరణించడంతో దశదిన కర్మక్రియలు పూర్తిచేసిన తర్వాత కుటుంబసభ్యులు 12 మంది ఈనెల 9వ తేది రాత్రి సంగం శివాలయంలో నిద్ర చేసేందుకు ఆటోలో బయలుదేరారు. సంగం సమీపంలో బీరాపేరు వాగువద్ద వంతెనపై ఆటో వస్తుండగా ఎదురుగా లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దాంతో ఆటో వంతెన గోడను ఢీకొని బీరాపేరు వాగులో పడిపోయింది. వంతెన రెయిలింగ్ కూడా కొంతభాగం ముక్కచెక్కలైంది. రాత్రి వేళ కావడం, ఉన్నట్లుండి ఆటో వాగులో పడిపోవడంతో అందరూ హాహాకారాలు చేశారు. ఏం జరిగిందో తెలుసుకునేలోగానే ఆటోలో ఉన్న వారంతా వాగులో పడిపోయారు. స్థానికులు వారిని రక్షించేందుకు ప్రయత్నించి ఏడుగురిని బయటకుతీశారు. వీరంలో కర్రా నాగవల్లి (14) మృతిచెందిండి. మరో అయిదుగురు ప్రవాహంలో గల్లంతయ్యారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఆత్మకూరు, సంగం, నెల్లూరుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు హుటాహుటిన బీరాపేరు వాగు వద్దకు వెళ్ళి గాలింపు చర్యలు చేపట్టారు. వాగు ఉధృతంగా ఉండడంతో, మరోవైపు వర్షం కురుస్తుండడంతో గల్లంతైన వారి ఆచూకీ లభించలేదు. అయినా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు పడవలపై వెళ్ళి పట్టుదలతో గాలింపు నిర్వహించగా ఈనెల 11న తండ్రీకొడుకులు కర్రా పుల్లయ్య, నాగరాజు మృతదేహాలు వాగులో లభించాయి. ఈనెల 15 నాటికి ముగ్గురు మృతదేహాలు లభించినట్లయింది. ఇక మిగిలిన కర్రా సంపూర్ణమ్మ, పద్మ, దివానవు ఆదెమ్మల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఆ తర్వాత నాగవల్లి తల్లి పద్మ మృతదేహం కూడా లభించింది. ఎంతగా వెతికినా మిగిలిన సంపూర్ణమ్మ, ఆదెమ్మల జాడ తెలియలేదు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఇన్ని రోజులుగా నిర్విరామంగా గాలింపు జరుపుతూనే ఉన్నాయి. పడవలపై వాగులో వెళ్తూ, ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రివేళల్లో కూడా వెతుకుతున్నారు. గాలింపు ఈనెల 16న కూడా కొనసాగింది. ఈ దుర్ఘటన ఆత్మకూరు వాసులను శోకతప్తులను చేసింది. జిల్లా ప్రజలను ఆవేదనకు గురిచేసింది.

## సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

బీరాపేరు వాగు బ్రిడ్జి వద్ద ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. ఇటీవల బీరాపేరు వాగు బ్రిడ్జి వద్ద ఆటో బోల్తా పడిన సంఘటన స్థలాన్ని కలెక్టర్ ఈనెల 14వ తేది సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాదం జరిగిన తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు చేపట్టిన సహాయ కార్యక్రమాల గురించి ఆర్‌డిఓ చైత్రవర్షిణి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ బ్రిడ్జి వద్ద ప్రమాదాల నివారణకు విద్యుత్ లైట్లు, హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్ లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి డిఈ అనిల్ కుమార్ రెడ్డిని ఆదేశించారు. సంగం తాసిల్దార్ నిర్మలానంద బాబా, ఎంపీపీ రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కళ్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు కె.వి.సుబ్బారెడ్డి - అనితల కుమార్తె **శృతి - హరీష్‌రెడ్డి** ల కల్యాణం డిసెంబర్ 9వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

# ఏపీలో పర్యాటక అభివృద్ధికి ఏం చేశారు?



## - లోక్‌సభలో ప్రశ్నించిన నెల్లూరు ఎంపీ ఆదాల

ఆంధ్రప్రదేశ్లో హెరిటేజ్ పథకం కింద కొత్త ప్రాజెక్టులు ఏమైనా కేటాయించారా?. ఈ పథకాన్ని సీఎస్ఆర్‌కు ఏమైనా అనుసంధానించారా? అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం లోక్‌సభలో ప్రశ్నించారు. గండికోట, గుడ్లూరు ప్రాంతాల్లో కనీస సౌకర్యాల కల్పనకు ఎలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆయన ప్రశ్నించారు. దీనికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి రాతపూర్వకంగా సమాధానమిస్తూ హెరిటేజ్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట ఫోర్ట్‌కి ఒక ఒప్పందం కుదిరిందన్నారు. అదేవిధంగా బహుభాషా ఆడియో గైడ్ అభివృద్ధి కోసం కూడా మరో ఒప్పందం జరిగిందని తెలిపారు.

### కోవిడ్-19 టీకాపై ఏ విధమైన అవగాహన కలిగించారు? :

కోవిడ్-19 ను నిరోధించేందుకు దేశవ్యాప్తంగా ఎలాంటి అవగాహనను కలిగించారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి మంగళవారం పార్లమెంట్లో ప్రశ్నించారు. అవగాహన కార్యక్రమాల కోసం ఏ మేరకు ఖర్చుచేశారు? ఆ వివరాలేమిటని కూడా ప్రశ్నించారు? దీనికి కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ రాతపూర్వకంగా జవాబు చెబుతూ కోవిడ్ - 19 ను నిరోధించేందుకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. కరోనాను నిరోధించే వ్యాక్సిన్‌తో పాటు ఎన్నో ప్రచార కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి), బ్యూరో ఆఫ్ అవుట్ రీచ్ అండ్ కమ్యూనికేషన్ (బి.ఓ.సి), ప్రసార భారతి, పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్, దూరదర్శన్, ఆలిండియా రేడియోల ద్వారా ఇంగ్లీష్, హిందీ, ఇతర ప్రాంతీయ భాషల్లో వివిధ మాధ్యమాల ద్వారా ఉపయోగించుకున్నామని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, ఇంటర్నెట్, వెబ్ సైట్‌లు అవుట్డోర్, ఇంటర్ పర్సనల్ మీడియాతో పాటు పత్రికా సమావేశాలు, ప్రకటనలు, వెబ్ నార్లు ఉపయోగించినట్లు పేర్కొన్నారు.

### హృదయ్ పథకం కింద అమరావతి అభివృద్ధి ఎంత?

హెరిటేజ్ సిటీ డెవలప్మెంట్ అండ్ ఆగ్మెంటేషన్ యోజన (హృదయ్) పథకం కింద ఏ మేరకు అమరావతి అభివృద్ధి జరిగిందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి గురువారం పార్లమెంట్లో ప్రశ్నించారు. ఈ పథకం కింద ఏ మేరకు నిధులు కేటాయించారు, ఆ నిధులు ఏ మేరకు వినియోగించారని కూడా ప్రశ్నించారు.? దీనికి కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖ మంత్రి కౌశల్ కిషోర్ రాతపూర్వకంగా సమాధానమిస్తూ హృదయ్ పథకం 2015 జనవరి 21న ప్రారంభమై, 2019 మార్చి 31తో పూర్తయిందని తెలిపారు. ఈ పథకం కింద అమరావతిలో అప్రోచ్ రోడ్లు, చెరువు అభివృద్ధి కింద 22. 26 కోట్ల రూపాయలను కేటాయించి, అందులో 16.60 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో పనులకు 13. 97 కోట్లను వినియోగించినట్లు పేర్కొన్నారు.

# నూరు శాతం వ్యాక్సినేషన్‌లో.. జిల్లా ఫస్ట్

కోవిడ్ వ్యాక్సినేషన్ అందరికీ అందించాలనే సంకల్పంతో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు నేతృత్వంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం కృషి చేసి రాష్ట్రంలోనే మొదటి డోసు వ్యాక్సినేషన్‌ను 100 శాతం పూర్తి చేసిన జిల్లాగా నెల్లూరు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపారు. ఈ సందర్భంగా అందుకు సహకరించిన ప్రజలకు, ప్రజాప్రతినిధులకు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులకు, వైద్యులకు, ఆశా వర్కర్లకు, సచివాలయాల సిబ్బందికి అందరికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో సమష్టి కృషితో 2వ డోసు వాక్సినేషను కూడా 100 శాతం త్వరగా పూర్తిచేసి జిల్లాకు మంచి గుర్తింపును తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. మన రాష్ట్రంలో జనవరి 16, 2021 నుండి, 18 సంవత్సరాలు నిండిన వారందరికీ కరోనా నియంత్రణ టీకా వేసే ప్రక్రియ మొదలైనప్పటి నుండి, జిల్లాలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన 23,69,865 మందికి మొదటిడోసు టీకా వేసి ఈనెల 11వ తేదీ నాటికి మొదటి డోసు వాక్సినేషను నూటికి నూరు శాతం పూర్తిచేసిన మొట్టమొదటి జిల్లాగా నెల్లూరు జిల్లా ప్రథమస్థానంలో నిలవడం విశేషం.

## ఏపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌గా...

# ప్రమాణ స్వీకారం చేసిన.. రాంకుమార్‌రెడ్డి



మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తనయుడు, తిరుపతి – బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు, వైకాపా నేత నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఈనెల 14న క్యాబినెట్ హోదా కలిగిన ఏపీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌గా పదవీ ప్రమాణస్వీకారం చేయడంతో నేదురుమల్లి అభిమానుల్లో సంతోషం వెల్లువెత్తింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాంకుమార్‌కు ఈ కీలకమైన పదవిని అప్పగించారు. దీంతో అమరావతిలోని వెలగపూడిలో ఏపీ కమ్యూనిటీ అభివృద్ధి కార్యాలయంలో రాంకుమార్‌రెడ్డి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఉన్నత విద్య ఛైర్మన్ హేమరామచంద్రారెడ్డి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, వైకాపా నాయకుడు కనుమూరి హరిశ్చంద్రారెడ్డి, నాయకులు కొడవలూరు భక్తవత్సలరెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, తదితర ప్రముఖులుతోపాటు భారీ సంఖ్యలో రాంకుమార్‌రెడ్డి అభిమానులు, వైకాపా కార్యకర్తలు ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఈ సందర్భంగా రాంకుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు. రాంకుమార్‌రెడ్డి అభిమానులు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు.

# శ్రీసిటీని సందర్శించిన యూనివర్సిటీల ప్రముఖులు




ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఆర్.హరిగోపాలరెడ్డి, విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి ఈనెల 15న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మార్కెటింగ్ అధికారులు వారికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, ఉపాధి అవకాశాలను వివరించారు. అనంతరం వీరు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి వివిధ అంశాలపై చర్చించారు. పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు, అవసరమైన నైపుణ్య శిక్షణపై తమ విద్యార్థులకు అవగాహన కల్పించాలని డాక్టర్ విజయకృష్ణారెడ్డి ఈ సందర్భంగా ఎం.డిని కోరారు. దీనిపై స్పందించిన రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తామన్నారు.

# అమరజీవికి చలమయ్య నివాళి



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 69వ వర్ధంతి సందర్భంగా ఈనెల 15న నెల్లూరులోని ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు, ఏపీ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి కెవి చలమయ్య అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, ఐవిఎఫ్ సభ్యులు ఆర్‌వి శరత్, సొల్లేటి నాగేశ్వరరావు, నగరకంటి రవీంద్రనాథ్, అవోపా సభ్యులు అనుమాలశెట్టి నరసింహులు, ఆర్.శేషగిరి, రాయవరపు రామకృష్ణ పాల్గొన్నారు.

# మానవాళికి దిక్సూచి..భగవద్గీత



మానవాళికి భగవద్గీత దిక్సూచి అని, భగవద్గీత అందరికీ దివ్యమైన మార్గాన్ని చూపే పవిత్రగ్రంథమని వక్తలు పేర్కొన్నారు. ఈనెల 14న నెల్లూరులోని టిటిడి కల్యాణమండపంలో గీతాజయంతి జరిగింది. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. 6,7 తరగతులకు సంబంధించి ఎన్‌వి శశాంక, ఎస్.కావ్య, ఎన్.భవ్యహాసిని ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు సాధించగా, 8,9 తరగతులకు చెందిన విద్యార్థుల విభాగంలో బివిఎన్ భావేష్, ఏ.సుధీర్, ఎస్.చందన వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. అదేవిధంగా 18 ఏళ్ళలోపు వారికి నిర్వహించిన పోటీలో ఏ.సుధీర్, సిహెచ్ అక్షర ఆత్రేయ, సిహచ్ అచ్యుత ఆత్రేయ, 18 ఏళ్ళు పైబడినవారిలో ఎం.సంగీతలక్ష్మి, ఎం.వాసు, ఎం.చెంచులక్ష్మి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. న్యాయనిర్ణేతలుగా ప్రముఖ సాహితీవేత్త చీమకుర్తి వెంకటేశ్వరరావు, అవధాని కోట రాజశేఖర్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి వ్యవహరించారు. టిటిడి కల్యాణమండపం మేనేజర్ మోహన్, హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ దేవరాజులు, శ్రీ వేంకటేశ్వర కల్యాణ సేవాసమితి అధ్యక్షుడు కళాదీప్తి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర జానపద కళాకారుల సంక్షేమసంఘం అధ్యక్షుడు వెంకటరమణయ్య, సంగీతలక్ష్మి, కె.టి నాయుడు పాల్గొన్నారు.

### వరద బాధితులకు

## ‘సత్యసాయి సేవా ట్రస్టు’ సాయం



నెల్లూరుకు చెందిన సత్య సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గిరిజనకాలనీలోని సుమారు 200 కుటుంబాలకు చెందిన వరదబాధితులకు ఇటీవల నిత్యావసర సరుకులను, వస్త్రాలను అందజేసి అందరికీ భోజనం పెట్టి తమ సేవాభావం చాటుకున్నారు. ఎంపిటిసి నారాయణ సూచన మేరకు ఈ సేవా కార్యక్రమం నిర్వహించామని ట్రస్టు జిల్లా శాఖ అధ్యక్షుడు సుధాకర్ చెప్పారు. మానవసేవే మాధవ సేవగా భావించే తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లు కామేశ్వరమ్మ, ట్రస్టు సభ్యుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జీవనశైలితో వ్యాధులను దూరం చేసుకోవచ్చు

### - సూచించిన డాక్టర్ దత్తాత్రేయులు




మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, జీవన శైలి ద్వారా అనేక రకాలైన వ్యాధులను దూరం చేసుకోవచ్చుని నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల వైద్యుడు డాక్టర్ దత్తాత్రేయులు సూచించారు. ఈనెల 12న డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. క్రమబద్ధమైన ఆహారపు అలవాట్ల ద్వారా మధుమేహవ్యాధిని కూడా అదుపులో ఉంచుకోవచ్చన్నారు. తక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవాలని, తీపి పదార్థాలు, బేకరీ ఫుడ్స్, కూల్‌డ్రింక్స్, దుంపకూరలు వంటివాటికి దూరంగా ఉండాలన్నారు. తొలుత రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. నెల్లూరు ఆసుపత్రి ఎం.డి గోపాల్, కోశాధికారి శ్రీనివాసులు, ట్రస్ట్ సభ్యులు మాల్యాద్రి, నారాయణ, బ్రహ్మం, అబ్బాయిరెడ్డి, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ రవి, వలంటీర్లు లీలమ్మ, బాబునాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### సమన్వయంతో పనిచేసి..

## ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి

### తడ మండల సమావేశంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య




మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, శ్రద్ధతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యుడు కిలివేటి సంజీవయ్య అధికారులు, ఉద్యోగులకు సూచించారు. ఈనెల 12న తడలో ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన తొలి మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని చెప్పారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలని సూచించారు. మండలంలోని ప్రజలంతా కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకునేలా చర్యలు తీసుకోవాలని, ఓటిఎస్‌పై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సంపూర్ణ గృహహక్కు పథకంపై టిడిపి వారు లేనిపోని దుష్ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు ఈ పథకం పట్ల అవగాహన కలిగించుకుని ఆ పథకం సద్వినియోగం అయ్యేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రామయ్య, ఇన్‌చార్జి ఎంపిడిఓ శైలేంద్రబాబు, ఎంపిపి కొలవి రఘు, ఏఎంసి ఛైర్మెన్ మారంరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, తడ కండ్రిగ సర్పంచ్ తుమ్మా జయప్రద తదితరులు పాల్గొన్నారు.

### చాముండేశ్వరి అమ్మవారికి

## విశేష పూజలు

### దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో కొలువైవున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 12న విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు మాచవోలు రామకృష్ణ, అనిల్‌కుమార్‌లు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్ళు పొంగించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీనివాసులుతో పాటు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కృష్ణచైతన్య తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## గంగపట్నం పేదలకు.. రోటరీ సాయం




ఇందుకూరుపేట మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వరదకు గురై ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలకు రోటరీ క్లబ్ వారు ఈనెల 12న దుస్తులు, చీరలు పంపిణీ చేసి తమ సేవాభావం చాటుకున్నారు. గంగపట్నం గ్రామంలోని 210 కుటుంబాలకు, పున్నూరులోని 100 కుటుంబాలకు, ముదివర్తిపాళెంలోని 100 కుటుంబాలకు చీరలు, దుస్తులు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు విశ్వం, పెనుబల్లి హనుమంతురావునాయుడు, నేదురుమల్లి సుబ్బారెడ్డి, పెనుబల్లి బాబునాయుడు, జయంత్‌కుమార్‌రెడ్డి, పెనుబల్లి సీతారామనాయుడు, పెనుబల్లి కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం రామనామం మారుమ్రోగే ‘బారకాసు’ రామాలయం

***‘ఆపదామప హర్తారం..***
***దాతారం సర్వ సంపదాం!..***
***లోకాభిరామం శ్రీరామం***
***భూయో భూయో నమామ్యహం’..***

***అంటోంది ఆపదుద్ధారక స్తోత్రం. శ్రీరామచంద్రుడు భక్త వరదుడు. భక్తుల బాధలు బాపి, ఆపదల్లో ఆదుకునే ఆపద్బాంధవుడు. అంతేకాదు, సర్వ సంపదలను ఇచ్చే దాత.. అందరికీ అభయప్రదాత. అందుకే సకల సద్గుణ శోభితుడైన ఆ సీతారామ చంద్రుడిని అనునిత్యం పూజించుకునేందుకు కొన్నేళ్ళ క్రితం నెల్లూరు నగరంలోని బారకాసు కూడలిలో భక్తులందరూ కలిసి శ్రీరామ భజన మందిరం ప్రారంభించారు. అదే ఆ తర్వాత కాలంలో అత్యద్భుతమైన శ్రీరామమందిరంగా రూపుదిద్దుకుని నగరంలోని రామభక్తులందరికీ కొంగుబంగారంగా ఉంది. ఈ ఆలయం ఇటీవల కాలంలోనిదే అయినా, సుమారు ఎనిమిదేళ్ళ క్రితం నూతనంగా దివ్యమైన ఆలయంగా రూపు దిద్దుకుని భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ ఉంది. స్థానికుల కథనం మేరకు ఆలయ విశేషాలిలా ఉన్నాయి.***

శ్రీరామునిపై అచంచల భక్తితో గాండ్ల కులస్తులైన కొంత మంది రామభక్తులు సుమారు 47 ఏళ్ళ క్రితం..1974లో ‘గాండ్ల వారి శ్రీరామ మందిర సంఘం’గా ఏర్పడి ఆ సంస్థను రిజిస్టరు చేసుకుని నెల్లూరులోని బారకాసు సెంటర్‌లో శ్రీరామ భజనమందిరాన్ని ప్రారంభించారు. సీతారామ లక్ష్మణ హనుమత్సమేత పూజాపటం నెలకొల్పి నిత్యం భక్తాభీష్ట ప్రదాయకుడైన ఆ శ్రీరామచంద్రుని పూజించుకుంటూ ఉండేవారు. అప్పట్లో ఈ భజన మందిరానికి దాత స్వర్గీయ గిద్దలూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి నిత్యపూజలు, సేవలు జరిగేవి. ప్రతి నిత్యం శ్రీరామ భజనలతో, శ్రీరామ నామోచ్ఛారణలతో మందిరం ప్రాంతమంతా మారుమ్రోగుతుండేది. పేరుకు గాండ్ల కులస్తుల వారు ఏర్పాటుచేసిన భజనమందిరమే అయినా అన్ని





### మన దేవాలయాలు (78)

కులాల ప్రజలు, నగరంలోని పలు ప్రాంతాల వారంతా ఈ మందిరానికి వచ్చి పూజలు చేస్తుండేవారు. గాండ్ల కులస్తులకు పీఠాధిపతిగా, గురువుగా, ఆరాధ్యదైవంగా ఉన్న ప్రఖ్యాత హరికథా చక్రవర్తి, త్యాగరాజ భిక్షువు..స్వర్గీయ శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి వారు కూడా ఈ మందిరం వద్దనే గతంలో పలుసార్లు అద్వితీయంగా హరికథా గానం చేసేవారు. వేలాదిమంది ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చేవారు. దీంతో బారకాసు సెంటరులోని రామమందిరం ఖ్యాతి జిల్లావ్యాప్తమైంది. ఆ తర్వాత ఇటీవల దాకా గాండ్ల కులస్తులకు పెద్దదిక్కుగా ఉన్న ప్రముఖ దాత స్వర్గీయ గ్రోసు గోపాలయ్య ఆధ్వర్యంలో వారి కులస్తులంతా కలసి ఈ భజనమందిరాన్ని ఆలయంగా రూపుదిద్దాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా రామభక్తులంతా రంగంలోకి దిగారు. స్థానిక ప్రముఖుడు స్వర్గీయ మాడిశెట్టి వెంకటరమణయ్య తదితరుల సహకారంతో దాతలు, భక్తులందరి సహాయ సహకారాలతో శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్సమేతంగా శ్రీరామ మందిరాన్ని సర్వాంగసుందరంగా నిర్మాణం గావించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. 2013 ఫిబ్రవరి 11వ తేదీన విశేషపూజలు చేసి నూతన రామమందిరాన్ని ప్రారంభించారు. స్వామివార్ల విగ్రహప్రతిష్టా మహోత్సవాలను ఆ రోజు నుంచి మరో మూడు రోజుల పాటు ఫిబ్రవరి 14వ తేది దాకా వైభవంగా నిర్వహించారు కూడా.

### ఏటా వైభవంగా శ్రీరామనవమి :

నూతన ఆలయం ప్రారంభమైనప్పటి నుంచి స్వామివార్లకు ప్రత్యేక పూజలు, సేవలు, అలంకారాలు, అభిషేకాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చాకిరాల శేషయ్య ఆధ్వర్యంలో, కమిటీ సభ్యుల సారధ్యంలో ఆలయ అర్చకుడు స్వామివార్లకు నిత్యపూజలు సేవలు చేస్తున్నారు. పర్వదినాలు, ప్రత్యేకమైన రోజుల్లో విశేష పూజలు చేస్తున్నారు. ప్రతి ఏటా శ్రీరామనవమి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఎంతో మహిమాన్వితమైన రామనామంతో ఆలయ ప్రాంతమంతా నిత్యం హోరెత్తిపోతుంటుంది. ఈ ఆలయానికి ఉత్తరం వైపున ద్వారం ఉండడం ఒక ప్రత్యేకత. అందువల్ల వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం కూడా కన్నులపండువగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఉభయకర్తల ద్వారా స్వామివార్లకు నెలపొడవునా పూజలు, నిత్య నైవేద్యం సమర్పిస్తున్నారు. ఉభయకర్తల్లో స్థానిక వైశ్యప్రముఖులు, అనేకమంది భక్తులు కూడా ఉన్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 14వ తేదీన శ్రీ రామమందిరం వార్షికోత్సవ వేడుకలతో పాటు, ఏటా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను కూడా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుండడం ఇక్కడ మరో ప్రత్యేకత.

## ఆ ఒక్క వీరుడూ..
# మృత్యువు ఒడిలోకి ఒరిగిపోయాడు



### తుదిశ్వాస విడిచిన కెప్టెన్ వరుణ్‌సింగ్

ఆ ఒక్క వీరుడైనా బతకాలని దేశప్రజలు నిండుమనసుతో కోరుకున్నా విధి కర్కశ హృదయం కరగలేదు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఘోర దుర్ఘటనలో భారతదేశ తొలి త్రిదళాధిపతి, మహాయోధుడు బిపిన్ రావత్‌ను పొట్టనపెట్టుకున్న హెలికాప్టర్ ప్రమాదంలో చెలరేగిన మంటల్లోంచి వరుణ్‌సింగ్ ఒక్కరే తీవ్రంగా కాలిన గాయాలతో బతికి బయటపడ్డారు. ఆయన్ను వెంటనే బెంగుళూరులోని ఆర్మీఆసుపత్రిలో చేర్చి లైఫ్ సపోర్ట్ సిస్టంపై ఉంచి చికిత్సలు అందించారు. ఆరోజునుంచి వరుణ్ మృత్యువుతో అనుక్షణం పోరాడుతూనే ఉన్నారు. ఎలాగైనా కోలుకుంటారని, కోలుకోవాలని అందరూ కోరుకున్నారు. అయితే వరుణ్ మృత్యువుతో కడదాకా పోరాడి అలసిపోయారు. ఈనెల 15న ఆయన మృత్యువు ఒడిలోకి చేరిపోయారు. గత ఆగస్టులో ఎంతో విశిష్టమైన శౌర్యచక్ర పురస్కారాన్ని కూడా అందుకుని, సాహసోపేతమైన వీరునిగా.. దేశానికి గర్వకారణమైన సేవలందిస్తున్న వరుణ్‌ను కూడా ఈ ప్రమాదంలో మృత్యువు బలితీసుకోవడం దారుణం!. ఈ విషాదం దేశాన్ని కంటతడిపెట్టించింది.

### వీరుల కుటుంబం :

వరుణ్‌సింగ్ వీరుల కుటుంబంలో జన్మించారు. ఆయన స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాపూర్. ప్రస్తుతం భోపాల్‌లో నివసిస్తున్నారు. ఆయన తండ్రి కెపి సింగ్ ఏఏడిలో కల్నల్‌గా పనిచేసి రిటైరయ్యారు. సోదరుడు కూడా సైన్యంలోనే సేవలందిస్తున్నారు. వరుణ్‌కు పదకొండేళ్ళ కుమారుడు, ఎనిమిదేళ్ళ కుమార్తె ఉన్నారు. గత ఆరునెలలుగా వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ స్టాఫ్ సర్వీసెస్ కాలేజీలో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న వరుణ్, తాను పనిచేస్తున్న కాలేజీకి భారత త్రిదళాధిపతి బిపిన్ రావత్ వస్తుండడంతో ఆహ్వానించేదుకు ఈనెల 8న సూలూర్ ఎయిర్‌బేస్‌కు వచ్చి స్వాగతం పలికి బిపిన్‌తో కలసి హెలికాప్టర్‌లో తిరిగి వెల్లింగ్టన్‌కు బయలుదేరారు. అయితే దురదృష్టవశాత్తూ హెలికాప్టర్ ప్రమాదానికి గురికావడంతో బిపిన్‌తో సహా 13 మంది మృత్యువాత పడగా, ఆ ఘోర ప్రమాదంలో వరుణ్ ఒక్కరే తీవ్రంగా కాలిన గాయాలతో బయటపడ్డారు. అనంతరం ఆయన్ను చికిత్స కోసం వెల్లింగ్టన్ మిలిటరీ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగుళూరులోని కమాండ్ ఆసుపత్రికి తరలించి నిరంతర చికిత్సలందించారు. చివరి క్షణం వరకు ఆయన మృత్యువుతో పోరాడారు. అయినా విధి రాత..ఆ మహావీరుడిని మృత్యువు వెంటబెట్టుకుపోయింది. ఈనెల 17న భోపాల్‌లో అశేషజనవాహిని మధ్య, సైనికాధికారులు, కుటుంబసభ్యుల కన్నీటిసంద్రం మధ్య, ప్రముఖుల అశ్రుతర్పణాల మధ్య..ఆ వీరుని పార్థివదేహానికి అంత్యక్రియలు జరిగాయి.

## ప్రపంచ స్థాయి అభివృద్ధి చూసేందుకు...
# శ్రీసిటీని సందర్శించండి
### - బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్



ప్రపంచ స్థాయి అభివృద్ధిని చూసేందుకు ప్రతి ఒక్కరూ శ్రీసిటీని సందర్శించాలంటూ ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్ సిఫార్సు చేశారు. ఈనెల15న చెన్నైలో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఒలివర్ బాల్‌హాట్‌చెట్ (ఎంబిఈ) ఏర్పాటు చేసిన యుకె బిజినెస్ క్రిస్మస్ డిన్నర్ రిసెప్షన్‌లో యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన పరిశ్రమల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మరియు శ్రీసిటీలోని యుకె పరిశ్రమల సీనియర్ అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆండ్రూ తన శ్రీసిటీ పర్యటనను గుర్తుచేసుకుంటూ, వాస్తవానికి శ్రీసిటీని చూడటం చాలా సంతృప్తికరమైన అనుభవాలలో ఒకటని పేర్కొన్నారు. శ్రీసిటీ వ్యాపార సామర్థ్యాన్ని పరిశీలించడానికి ఒకసారి తప్పక సందర్శించాలని పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు పిలుపునిస్తూ, మరిన్ని యుకె కంపెనీలు తమ కార్యకలాపాలకు శ్రీసిటీని ఎంచుకుంటాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి శ్రీసిటీ గురించి వివరించారు. శ్రీసిటీ గురించి తెలుసుకోవడంలో డా. ఆండ్రూ ఫ్లెమింగ్, ఇతరులు చూపిన శ్రద్ధను తాము గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు.






# దివ్య కాశి!.. ఇక.. నవ్య కాశి!
(మొదటి పేజీ తరువాయి)




చేతుల మీదుగా జరుగుతున్న మహత్కార్యాలతో పులకించిపోయింది. 3వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆలయ ప్రాంగణాన్ని దాదాపు అయిదు లక్షల చదరపు అడుగుల మేర విస్తరించడంతో ఆలయ ప్రాంగణం విశాలమై సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. భక్తుల వసతుల కోసం 23 భవనాలను కూడా నిర్మాణం గావించారు. ఈ సందర్భంగానే కాశీలోని 40 ప్రాచీన ఆలయాలను పునరుద్ధరించారు. 800 కోట్ల అంచనాతో 2019లో ఈ పనులకు శంకుస్థాపన జరిగింది. తొలిదశలో 339 కోట్లు వెచ్చించి అనేక పనులు చేపట్టి పూర్తి చేశారు. ఇంత అద్భుతమైన ప్రగతిని చూసి కాశి ప్రజలు ఆశ్చర్యంతో తలమునకలయ్యారు.

### భారతీయు చిరకాల స్వప్నం నెరవేరింది :

ప్రధాని మోడీ ఈ కారిడార్‌కు ప్రారంభోత్సవం చేయడంతో, ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న కాశీవిశ్వనాథ్ కారిడార్ కల సాకారమైంది. దీంతో ఇప్పుడు సుమారు 75 వేల మంది భక్తులు ఒకేసారి ఆలయ సందర్శన చేసుకోవచ్చు. ఇది భారతీయుల చిరకాల స్వప్నం. అకుంఠిత దైవభక్తితో, సంకల్పసిద్ధితో, చిత్తశుద్ధితో ప్రధాని మోడీ ఈ బృహత్కార్యాన్ని సాధించారన్న ఆనందం కాశీప్రజల్లో సంతోషాతిరేకాలుగా వెల్లువెత్తింది. కాశీలోని ఇరుకు వీధులు మటుమాయమై కాశి నగరం ఇప్పుడు ఎంతో సుందరనగరంగా రూపుదిద్దుకోవడం ఒక అద్భుతం. అదేవిధంగా గతంలో కాలుష్యభూయిష్టంగా మారిన పవిత్ర గంగానదికి ఇటీవలి కాలంలో మహర్దశ కలిగింది. 'నమామి గంగే ప్రాజెక్టు' ద్వారా ప్రధాని మోడీ సంకల్పంతో గంగానది కాలుష్యాన్ని నివారించేందుకు చేపట్టిన పథకం పనులు అంచలంచెలుగా పరుగులెత్తుతున్నాయి. ఇవి కూడా పూర్తయితే గంగమ్మ తల్లి పూర్వ వైభవం సంతరించుకుని స్వచ్ఛమైన నీటితో జలజలా ప్రవహిస్తుంది.

### ప్రధాని ప్రసంగానికి పులకించిపోయిన ప్రజలు

కాశీలో కాశీవిశ్వనాథ్ కారిడార్ ప్రారంభానికి వచ్చిన ప్రధాని మోడీని చూసి ప్రజలు ఆనందపరవశులయ్యారు. ఆయన అద్భుతమైన ప్రసంగానికి పులకించిపోయారు. ప్రపంచ చరిత్రలోనే వారణాసికి ప్రత్యేక స్థానం ఉందని, ఎందరు సుల్తాన్‌లు పుట్టుకొచ్చినా, మట్టిలో కలిసినా ఈ కాశీ చారిత్రిక నగరం చెక్కుచెదర లేదని ప్రధాని మోడీ ఈ సందర్భంగా అన్నారు. ఈనెల 13న ఆయన తన సొంత నియోజకవర్గమైన వారణాసిలో 339 కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాశీవిశ్వనాథ్ కారిడార్ తొలిదశను ప్రారంభించి దేశానికి అంకితం చేసిన తర్వాత, ప్రధాని మాట్లాడుతూ ఎందరో ఆక్రమణదారులు వారణాసిపై దండెత్తారని, వారణాసిని, నాగరికతను మార్చేద్దామని అనుకున్నారని, అయినా వారికి సాధ్యం కాలేదని అన్నారు. ఇక్కడ ఔరంగజేబు వస్తే అక్కడ మరాఠాయోధుడు శివాజీ పుట్టుకొచ్చాడని, సలార్‌మసూద్ మనపైకి దండెత్తితే రాజా సుహెల్‌దేవ్ మన ఐక్యత బలమేమిటో చాటిచెప్పాడంటూ ప్రధాని అనడంతో కరతాళధ్వనులు మార్మోగిపోయాయి. మన దేశభక్తి, మనదేశ శక్తి కంటే వినాశకారుల బలం గొప్పది కాదని, కాశీని నాశనం చేద్దామనుకున్నవారు చీకటిపుటలకు పరిమితమైతే, కాశి మాత్రం కొత్త అధ్యాయంతో వెలిగిపోతోందని, ఇది సాక్షాత్తూ ఆ పరమేశ్వరుని రక్షణలో ఉన్న నగరమని, ఈ నగరం నాశనం లేనిదని.. ప్రధాని చేసిన ప్రసంగం అందరినీ ఉత్తేజభరితుల్ని చేసింది. కాశీకి రావడం గర్వంగా అనిపిస్తుంది. కాశి అందరిది.. గంగా అందరిది. విశ్వనాధుడి ఆశీస్సులు అందరివీ.. అని ఆయన అన్నారు. కాశీ విశ్వనాథ ధామం మన సనాతన ధర్మానికి, సంస్కృతికి ప్రతీక అని, భారతదేశ శక్తికి, చైతన్యానికి చిహ్నమని ప్రధాని అన్నారు. స్థలం ఇరుకుగా ఉండడంతో కాశీవిశ్వనాథుడిని, గంగాదేవిని దర్శించుకోవడం కష్టంగా ఉండేది. విశ్వనాథ్ ధామ్ పూర్తయితే ఇక్కడికి రావడం అందరికీ సులభమవుతుంది. అందుకే 3వేల చదరపు అడుగుల్లో ఉన్న మందిరాన్ని 5లక్షల చదరపు అడుగులకు విస్తరించాం. ఇప్పుడు 50వేల నుంచి 75వేల మంది కాశీవిశ్వనాథుని మందిరాన్ని దర్శించుకోవచ్చు..అంటూ ఆయన పెద్దపెట్టున 'హరహర మహాదేవ'..అని శివనామోచ్చరణ చేయడంతో ప్రధాని ఉత్తేజపూరిత ప్రసంగానికి ప్రజలు పరవశించిపోయారు.

### భక్తితో గంగా స్నానం...
### కార్మికులతో సహపంక్తి భోజనం :

ప్రధాని మోడీ ఈ సందర్భంగా కాశీ విశ్వనాథ్ కారిడార్ నిర్మాణంలో భాగస్వాములైన కార్మికులపై పూలరేకులు చల్లి నమస్కరించారు. వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు. సాధారణ పౌరుడిలా వారి మధ్య కూర్చుని భోజనం చేయడం, వారితో ముచ్చటించడంతో కార్మికులు ఎంతగానో మురిసిపోయారు. ఆ తర్వాత ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలసి వారణాసి వీధుల్లో కాసేపు నడిచారు. కాశీకి రాగానే ప్రధాని గంగానదిలో పుణ్యస్నానమాచరించారు. ఆ తర్వాత ఎంతోభక్తితో గంగా హారతిని దర్శించుకున్నారు. అడుగడుగునా ప్రజలు ప్రధానికి ఈ సందర్భంగా ఘన నీరాజనాలు పలికారు.

# రాహుల్ విమర్శలు
(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఈనెల 12న కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీలో రాహుల్ చేసిన ఆరోపణలు విమర్శకులను సైతం కలవరపరిచాయి. 'హిందూ'-'హిందూత్వ'..అనే పదాలు వేరువేరైనా, 'త్వం' అనే పదానికి 'నీవు' అని అర్థం కనుక 'నీవు హిందువు' అని అర్థం. 'హిందూత్వ' అన్నప్పుడు 'హిందువుకు సంబంధించిన' అని అర్థం. వాస్తవానికి ఈ రెండు పదాలు వేరైనా అర్థాలు మాత్రం ఒకదానికొకటి సంబంధించినవేనన్నది విమర్శకుల అభిప్రాయం. దైవత్వం అన్నప్పుడు దైవానికి సంబంధించిన తత్వం అన్నట్లుగానే, ఇది కూడా. హిందూ తత్వం ఉండడమే హిందూత్వమని, ఇవి రెండూ వ్యతిరేకమైనవేమీ కావన్నది విమర్శకుల అభిప్రాయం. ఇతరత్రా ఆరోపణలు ఎలా ఉన్నా, హిందువుల ఔన్నత్యానికి సంబంధించినవే ఈ రెండు పదాలన్నది అందరూ చెప్తున్న మాట.

అసలు హిందూ అన్నది ప్రాచీనకాలం నుంచి ఉన్న జీవన విధానమని, హిందూ ధర్మంగా అది ప్రసిద్ధి చెందిందని అందరికీ తెలిసిందే. అందులోనూ మనదేశం శాంతికి సంకేతం. ప్రపంచ శాంతిని కోరుకునే దేశం. హిందూధర్మం కూడా 'సర్వే జనా: స్సుఖినోభవంతు.. లోకా స్సమస్తా స్సుఖినోభవంతు' అని కోరుకుంటుంది. విశ్వకల్యాణమే హిందూ ధర్మం ధ్యేయం. అనాది నుంచి ఇది మన ఆచారం. అదే మన సంప్రదాయం..అదే మన సంస్కృతి.. మొత్తంగా అదే ఎంతో మహనీయమైన మన భారతీయ సంస్కృతి. ఆ వారసత్వాన్ని అందరం కాపాడుకోవాలి.

ఏదేమైనా, కొన్ని పదాలు గొప్పగా ఉంటాయి. ఒక జాతి, లేదా దేశ ఔన్నత్యాన్ని సూచిస్తుంటాయి. వాటిని కలవరపెడితే అందరి మనసులకీ బాధ కలుగుతుంది. తరచిచూసినా..'హిందూ' లేదా 'హిందూత్వ' అనే పదాలకు మంచి అర్థాలే ఉన్నాయి. పరస్పర విరుద్ధమైన అర్థాలేమీ లేవు. దీనిపై లేనిపోని రాద్ధాంతం ఎందుకన్నది రాజకీయపండితుల మాట. అయినా, నాయకుల మాటలకు అర్థాలే వేరులే అన్నట్లుగా..కొన్నిపదాలకు మామూలు అర్థాల కంటే, రాజకీయ అర్థాలు వేరువేరుగా ఉంటాయేమో మరి!..విజ్ఞులు..అనుభవజ్ఞులకే తెలియాలి!

## చెన్నైలో.. శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవనానికి..

# ఇక.. మంచి రోజులు!

**అభివృద్ధికి కొత్త కమిటీ నియామకం**



*చెన్నైలోని శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవనం అభివృద్ధికి ఆంధ్రరాష్ట్ర పభుత్వం కొత్తగా కమిటీని నియమించడంతో ఆ భవనానికి ఇక మంచిరోజులు వచ్చినట్లే. ఈ భవనం అభివృద్ధికి అహరహం తపించే కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాకు చెందిన వారు కావడం, నూతన కమిటీ ప్రారంభోత్సవానికి వచ్చి భవనం అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానంటూ 5 లక్షలు విరాళంగా కూడా ప్రకటించిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కూడా నెల్లూరీయులు కావడం విశేషం. తొలుత అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి అందరూ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నూతన కమిటీ వారు ప్రమాణస్వీకారం చేశారు.*





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ఆధ్వర్యంలో చెన్నైలోని మైలాపూర్‌లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం డిసెంబరు 11న ఘనంగా జరిగింది. కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షులుగా, వి.కృష్ణారావు కార్యదర్శి మరియు కోశాధికారిగా, శ్రీమతి వివి శశికళ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. వీరితో పాటు సభ్యులుగా డాక్టర్ విస్తాలి శంకరరావు, భువన చంద్ర, ఎం.వి నారాయణ గుప్తా, ఎంఎస్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ ఏవి శివకుమారి, జెఎం నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొని కొత్త కమిటీవారిచే ప్రమాణస్వీకారం చేయించారు.

### భవనం అభివృద్ధికి కృషిచేస్తా

**- మాగుంట శ్రీనివాసులురెడ్డి**

చెన్నైలో తెలుగువారికి ఎంతో విశిష్టమైన అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం అభివృద్ధి విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి తగు చర్యలు తీసుకుంటామని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న మంచినిర్ణయంతో ఈ కమిటీ నియామకం జరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవనం అభివృద్ధి గురించి, తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు, తెలుగుభాష ఉనికి కోసం ఇక్కడి సంఘాలు, ప్రజల మనోవేదనను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన చెప్పారు. అంతేకాక, స్మారక భవనం, గ్రంథాలయం తదితర అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులకు తనవంతు సహకారం ఉంటుందని చెప్తూ, అందుకు మాగుంట కుటుంబం తరపున 5 లక్షల రూపాయలను విరాళంగా ప్రకటించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. తెలుగు ప్రజలంతా ఐక్యంగా ఉంటే ఢిల్లీ తరహాలో చెన్నైలో కూడా ఆంధ్ర భవన్ నిర్మాణానికి ప్రభుత్వంతో మాట్లాడతానని ఆయన చెప్పారు. ఇక్కడి తెలుగు ప్రజలు, నాయకులు సంఘటితంగా ఉండి అందుకు స్థలం పొందేందుకు కృషి చేయాలని సూచించారు. చెన్నైలోని తెలుగు ప్రముఖుడు ఆచార్య సిఎంకె రెడ్డి కొత్త కార్యవర్గాన్ని అభినందించారు. కొత్త కమిటీ సభ్యులను టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇస్రాయెల్ శాలువా కప్పి సత్కరించారు. స్థానిక తెలుగు ప్రముఖులు, ప్రముఖ పారిశ్రామికవేత్త కె. నరసారెడ్డి, టిటిడి చెన్నై సమాచారకేంద్రం మాజీ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, పోక్కాలి బాలాజీ, బాలాంత్రపు లావణ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమరజీవి స్మారక భవనం నిర్మాణం కావడానికి, ఇప్పటిదాకా నిలవడానికి కారణమైన దివంగత వైఎస్ శాస్త్రిని స్మరించుకుంటూ, ఆయన కుమారుడు వైఎస్ రామకృష్ణను కమిటీసభ్యులు ఘనంగా సన్మానించారు.

### పలువురి విరాళాలు

చెన్నైకి చెందిన వైశ్య ప్రముఖుడు పోక్కాలి బాల సుబ్రహ్మణ్యం (గజలక్ష్మి బాలయ్య) శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవనం అభివృద్ధికి ఈ సందర్భంగా లక్ష రూపాయలు విరాళం ప్రకటించి శ్రీ పొట్టి శ్రీరాములు పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అదేవిధంగా తెలుగు మహాజన సమాజం వారు ఈ స్మారక భవనంలో గ్రంథాలయాల అభివృద్ధికి 2 లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ద్వారా ప్రభుత్వం ఆదేశించినట్లుగా శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను, గాంధీజయంతి, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవం, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఈ కమిటీ నిర్వహిస్తుందని, అదేవిధంగా ఉగాది, సంక్రాంతి పండుగ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామని అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయాన్ని విస్తరించేందుకు కృషి చేస్తామని, చెన్నైలోని పలు తెలుగు సంఘాలతో మమేకమై మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ సమాజంలో సఖ్యత, సౌభ్రాతృత్వం పెంపొందిస్తూ విశ్వమానవ శ్రేయస్సుకై ఈ కమిటీ పాటుపడుతుందని ఆయన వివరించారు.

# సంబరాల కన్నా.. సేవలే మిన్న

## ○ ప్రసన్న పుట్టినరోజున వెల్లువెత్తిన సేవా కార్యక్రమాలు





*తన పుట్టినరోజు వేడుకలకు సంబంధించి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి కొత్త ఒరవడి సృష్టించారు. అసలే భారీవర్షాలు, వరదలతో ప్రజలు ఒకవైపు సతమతమవుతుంటే తన జన్మదినాన్ని వేడుకగా జరుపుకోవడం తనకు ఇష్టం లేదని, సంబరాల కన్నా ప్రజలకు సేవచేయడమే మిన్న అంటూ, ఆరోజున భారీఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించి నిరుపేదలకు, నిరాశ్రయులకు తమవంతు సేవలందించాలని ఆయన తన సహచరులకు, అభిమానులకు చెప్పారు. దీంతో ఈనెల 12న ఆయన జన్మదినోత్సవం నిరాడంబరంగానే జరిగింది. ప్రసన్న సూచనల మేరకు అభిమానులు కోవూరు నియోజకవర్గంలో పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.*

**కోవూరులో రక్తదానం :**

కోవూరులో భారీఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 278 మంది పాల్గొని రక్తదానం చేశారు. వరదలతో నష్టపోయిన పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఏఏబి ఛైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎందరో బాధితులకు ప్రభుత్వ సాయం అందించడంతో పాటు తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే ప్రసన్న కష్టాల్లో ఉన్నవారిని ఆదుకుంటున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తమ ట్రస్ట్ తరపున పడుగుపాకు చెందిన ఒక బాలుడి క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం 20వేల రూపాయలు అందజేయగా ఆ మొత్తాన్ని ఆ బాలుడి కుటుంబానికి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పార్వతి, జడ్పీటిసి శ్రీలత, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ కిషోర్‌సింగ్, పడుగుపాడు సొసైటీ ఛైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, డిఎల్‌డిఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యుడు పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, బాబురావు, జుబేర్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, బుచ్చిరెడ్డిపాళెం లోని మునిసిపల్ కార్యాలయం వద్ద అభిమానులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసి, పలువురు కౌన్సిలర్లతో సహా మొత్తం 61 మంది రక్తదానం చేశారు. పోలినాయుడు చెరువులో యువత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బుచ్చిలోని ప్రభుత్వ వైద్యశాలలో బిట్రగుంట ప్రమీలమ్మ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

**అనాధాశ్రమాల్లో అన్నదానం :**

రేబాలలోని అనాధాశ్రమంలో వైకాపా నాయకుడు నాగసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టపాతోపులోని విశ్వజనని అనాధాశ్రమంలో కొత్తవంగల్లుకు చెందిన వైకాపా నాయకుడు చక్కా మనోహర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. నెల్లూరులోని వాత్సల్య అనాధాశ్రమంలో వైకాపా నాయకుడు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పిల్లలకు, వృద్ధులకు పండ్లు, బిస్కెట్లుతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఇందుకూరు పేట మండలంలోని కుడితిపాళెంలో వైకాపా మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో, కుడితిపాళెం ఎస్టీ కాలనీల్లో ముది వర్తికి చెందిన రఫీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. నార్త్‌రాజుపాళెంలోని హైవే వద్ద ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో డిసి ఎమ్మెస్ వీరి చలపతిరావు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేసి, ఎమ్మెల్యే ప్రసన్నకు మరిన్ని ఉన్నత పదవులు రావాలని కోరుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ముదివర్తి పాళెం మజరాలోని రాజుకాలనీలో డిఎల్ డిఏ ఛైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లను అందజేశారు. ఈ సేవా కార్యక్రమాల్లో కోవూరు నియోజకవర్గానికి చెందిన అనేకమంది నాయకులు, అభిమానులు పాల్గొని ఎమ్మెల్యే ప్రసన్న పట్ల, ప్రజల పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

## పెంచలకోన నిత్యాన్నదానానికి..79వేల విరాళం



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన భక్తులు పి. పెంచల ప్రసాద్-షర్మిల దంపతులు ఈనెల 12న 79వేల రూపాయలను విరాళంగా ఆలయ ఛైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాతలు ఆలయంలో ప్రత్యేకపూజలు చేసి స్వామివార్ల ప్రసాదం స్వీకరించారు.

## బిజెపి నేత పి.సురేంద్రరెడ్డికి పితృవియోగం



భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సురేంద్రరెడ్డి తండ్రి పి.ఆదిశేషారెడ్డి అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. ఈ సమాచారం తెలియగానే బిజెపి నాయకులు, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రముఖులు పెద్దసంఖ్యలో నెల్లూరు బాలాజీనగర్‌లోని సురేంద్రరెడ్డి నివాసానికి వెళ్ళి ఆదిశేషారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సురేంద్రరెడ్డిని పరామర్శించి వారి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు.

# 80వ జన్మదిన శుభాకాంక్షలు



మేనమామ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి సాంగత్యంలో
కాంట్రాక్టర్‌గా రాణించి,
నిత్య కృషీవలుడిగా, సేవా పరాయణుడిగా గుర్తింపును సాధించి,
నిస్వార్థ, నిష్కల్మష రాజకీయ నేతగా నెల్లూరుజిల్లాలో ఉదయించిన
మల్లెలాంటి మనసున్న మంచి మనిషి
మానవీయ విలువలున్న మహామనీషి
నాకు హితైషి, మా కుటుంబ శ్రేయోభిలాషి
మా **కోదండ మామ**
**80 వసంతాలు** పూర్తి చేసుకుంటున్న
ఆనంద సమయంలో
జన్మదిన శుభాకాంక్షలు.



**గునుపాటి మురళీకృష్ణారెడ్డి**
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

SSKC
**శ్రీ సాయి కృష్ణా కన్‌స్ట్రక్షన్స్**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com